

రాష్ట్రంలో రెండురోజుల పర్యటన కోసం శుక్రవారం ఉదయం బెంగళూరు చేరుకున్న ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ఆయన సతీమణి సుదేష్ ధన్‌ఖడ్‌కు స్వాగతం పలుకుతున్న గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్

విద్యార్థులతో ఉపరాష్ట్రపతి ముఖాముఖి

మండ్య, న్యూస్‌టుడే : నాగమంగల సమీపంలోని ఆదిచుంచనగిరి విశ్వవిద్యాలయ విద్యార్థులతో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శుక్రవారం మధ్యాహ్నం ముఖాముఖి మాట్లాడారు. భారత్‌లో తయారీ, ఆత్మనిర్భర భారత్ తదితరాలకు సంబంధించి తన అభిప్రాయాలను విద్యార్థులతో పంచుకున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో భారత్‌ను మొదటి వరుసలో నిలిపే బాధ్యత నేటితరం విద్యార్థులపైనే ఉందన్నారు. బెంగళూరుకు ప్రత్యేక విమానంలో వచ్చిన ఉపరాష్ట్రపతికి గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మాజీ ప్రధాని దేవేగౌడతో కలిసి ఆయన ప్రయాణించారు. శనివారం పద్మనాభనగరలోని దేవేగౌడ నివాసానికి ఉపరాష్ట్రపతి రానున్నారు.

'మణిపాల్'లో చేరిన గహ్లోత్

బెంగళూరు (శివాజీనగర): గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ శుక్రవారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. ఆయనను చికిత్స కోసం మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం స్వాగతం పలికారు. అనంతరం నీరసం, జ్వరంతో ఇబ్బంది పడుతున్న ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు.

బరిలో నవతరం.. ఎవరిదో విజయహారం!

- ముగిసిన నామినేషన్ల పర్వం
- మూడో తరానికి పట్టు దక్కేనా?



అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న నిఖిల్‌కుమారస్వామి. చిత్రంలో కేంద్ర మంత్రి కుమారస్వామి తదితరులు

ఈనాడు, బెంగళూరు : రాష్ట్రంలో మూడు నియోజకవర్గాల ఉప ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మూడు ప్రధాన పార్టీలకూ విధానాల కంటే రాజకీయ విమర్శలే ప్రధాన అస్త్రాలు కానున్నాయి. మూడు స్థానాల్లోనూ రాజకీయ కుటుంబాల వారసులు బరిలో దిగటం, ఓటమి పాలైన వారికి మరోసారి అవకాశాలివ్వటంతో పార్టీల్లో అసమ్మతి భగ్గుమంది. పార్టీ కీలక నేతలు రంగంలోకి దిగి అసమ్మతిని చల్లార్చటమే కాదు.. ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైంది. విధానసభ ఎన్నికలు ముగిసి ఏడాదిన్నర, లోక్‌సభ ఎన్నికల ఫలితాలొచ్చి ఆరు నెలలు దాటినా రాష్ట్రంలో రాజకీయ వేడి చల్లారలేదు. ఈ మూడు క్షేత్రాల్లో మూడు పార్టీలకూ గెలుపు అవకాశాలు సమానంగా ఉన్నా కార్యకర్తలు, సీనియర్ నేతల సహకారమే నిర్ణయాత్మకంగా మారనుంది. తాజా రాజకీయ పరిణామాలే ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి.

కేసుల ప్రభావం..

కాంగ్రెస్ ఏడాదిన్నర కిందట అధికారాన్ని చేపట్టినా ఈ కొద్ది కాలంలో పాలనపై దృష్టి సారించలేకపోయింది. ఉప ఎన్నికల ఫలితం అధికార పార్టీపై ఎలాంటి ప్రభావం చూపకపోయినా విపక్షాలపై పైచేయి సాధించటం ఎంతో అవసరం. ఇందు కోసమే చెన్నపట్టణలో సరైన అభ్యర్థి కోసం వ్యూహంతో యోగేశ్వర్‌ను ఆకర్షించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన డీకే సురేశ్‌కు టికెట్ ఇచ్చే స్వేచ్ఛ ఉన్నా స్థానిక రాజకీయాలకు ప్రాధాన్యమిచ్చింది. భాజపా కంటే జేడీఎస్‌పై అందులోనూ ఒక్కలిగ సముదాయంపై పట్టు కోసం కాంగ్రెస్ పార్టీ శ్రమించాల్సి వచ్చింది. నిత్యం అధికార పక్ష నేతలపై విరుచుకుపడే కుమారస్వామి వేగాన్ని నిలువరించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఒక్కటై చెన్నపట్టణ సమరానికి వ్యూహం సిద్ధం చేశారు. సండూరులో భాజపా అభ్యర్థి గెలుపు బాధ్యత చేపట్టిన గాలి జనార్దనరెడ్డి దూకుడుకు కళ్లెం వేసేందుకు జమీర్ అహ్మద్ నేతృత్వంలో బి.నాగేంద్ర, సంతోశ్‌లాడ్ తదితరులకు బాధ్యత అప్పగించారు. శిగ్గావ్‌లో నామినేషన్‌కు చివరి నిమిషంలో సీనియర్ నేత అజీంపీర్ ఖాద్రి నామినేషన్ వేయటంతో అధికారిక తిరుగుబాటు మొదలైంది. ఆయనతో నామినేషన్ ఉపసంహరించుకునేలా చేయటం, స్థానిక కార్యకర్తలను సమన్వయం చేయటం కాంగ్రెస్ ముందున్న సవాళ్లు. ఇక రాజకీయపరంగా కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రిపై నమోదైన కేసులే ప్రమాదకరంగా మారాయి. సరిగ్గా ఎన్నికల సమయంలో 'ముడా' కేసులో ముఖ్యమంత్రి సతీమణి పార్వతమ్మను విచారించగా, రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి విచారణ ఎదుర్కొనే ప్రమాదం ఉంది. మరోవైపు వాల్మీకి ఎస్టీ మండలి కేసు కూడా ఈ ఎన్నికల్లో విపక్షాలకు అస్త్రంగా మారుతుందని రాజకీయ విశ్లేషకుల అంచనా.

సమన్వయమే సమస్య..

ఈ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులనే బరిలో దింపిన భాజపాకు జేడీఎస్‌తో సమన్వయమే అసలు సమస్య. భాజపా జాతీయ నేతలతో పాటు యడియూరప్ప మాజీ ప్రధాని దేవేగౌడతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నా కుమారస్వామి రాజకీయమే భాజపాకు మింగుడుపడనివ్వదు. కేవలం కుమార కారణంగానే తాను కాంగ్రెస్‌కు వెళ్లినట్లు సి.పి.యోగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను భాజపా రాష్ట్ర నేతలు బహిరంగంగా తోసిపుచ్చలేకపోతున్నారు. కేవలం రోజుల వ్యవధిలోనే యోగేశ్వర్ పార్టీ ఫిరాయించటంతో చెన్నపట్టణంలో ఎన్‌డీఏ మిత్రుల సమన్వయం సమస్యగా మారింది. శిగ్గావ్, సండూరులో దళ్ ప్రభావం అంతగా లేదు. శిగ్గావ్‌లో భాజపాకు అంతగా అసమ్మతి కనిపించకపోయినా సండూరులో ఆ సమస్య ఎదురవుతోంది. కేవలం గాలి జనార్దనరెడ్డికే సండూరు బాధ్యత అప్పగించినా పార్టీకి ప్రమాదమేనని అధిష్ఠానం అంచనా వేస్తోంది. అక్కడ బి.శ్రీరాములు, దేవేంద్రప్ప, డామోదర్ నేతల మధ్య సమన్వయమే బంగారు హనుమంత గెలుపును నిర్ణయిస్తుంది. శిగ్గావ్‌లో బసవరాజ బొమ్మై నాయకత్వం భాజపాకు శ్రీరామ రక్ష అయినా కుటుంబ రాజకీయం స్థానిక కార్యకర్తల్లో అసహనాన్ని రేకెత్తిస్తోంది.



శిగ్గావ్‌లో నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న సోమప్ప రాయప్ప భరత్ బొమ్మై. చిత్రంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి తదితరులు.



సండూరు నియోజకవర్గ భాజపా అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బంగారు హనుమంత. చిత్రంలో విజయేంద్ర తదితరులున్నారు..

ప్రతిష్ఠగా పోరు..

పోటీ చేస్తున్న ఏకైక స్థానం జేడీఎస్ ప్రతిష్ఠకు పరీక్షగా మారింది. చెన్నపట్టణంలో నిఖిల్ కుమారస్వామి గెలిస్తే జాతీయ స్థాయిలో భాజపా- జేడీఎస్ బంధం మరింత బలపడుతుంది. కేవలం కుమారస్వామి వల్లనే గెలిచే అవకాశం ఉన్న యోగేశ్వర్ కాంగ్రెస్‌కు వెళ్లారని భాజపా నేతలు బహిరంగంగానే ఆరోపించిన నేపథ్యంలో ఇక్కడ నిఖిల్ గెలుపు ఎన్‌డీఏకు అనివార్యంగా మారింది. ముఖ్యమంత్రి, డీకే సోదరుల ప్రభావంతో పాటు స్థానికంగా నేతల సమన్వయాన్ని కాపాడుకోగలిగితేనే నిఖిల్ గెలుపు సాధ్యం. ఆ బాధ్యత తంతా కుమారస్వామికే విడిచి పెట్టారు. ఆ కారణంగానే దేవేగౌడ చెన్నపట్టణంలో తిష్ఠవేసి మనవడిని గెలిపించి ఎన్‌డీఏ బంధాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు కాస్తో కూస్తో కార్యకర్తల బలం ఉన్న సండూరు, శిగ్గావ్‌లోనూ భాజపా అభ్యర్థికి చేదోడుగా ఉండాలని జేడీఎస్ ప్రయత్నిస్తోంది.

ఖాద్రితో చర్చలు విఫలం



దర్గాలో ప్రార్థనల్లో జమీర్, ఇతర నేతలు, కార్యకర్తలు

హావేరి, న్యూస్‌టుడే : శిగ్గావ్ ఉప ఎన్నికల్లో టికెట్ దక్కలేదని స్థానిక నాయకుడు సయ్యద్ అజీం పీర్ ఖాద్రి తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో దిగారు. ఆయనను ఒప్పించి, నామినేషన్ వేయవద్దని కోరేందుకు ఖాద్రి నివాసానికి మంత్రులు జమీర్ అహ్మద్ ఖాన్, రహీమ్ ఖాన్, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్, వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు అన్వర్‌బాషా తదితరులు శుక్రవారం చేరుకున్నారు. ఎన్నికల్లో యాసిన్ అహ్మద్ ఖాన్ విజయానికి శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మీకు చక్కని రాజకీయ అవకాశాలను ఇస్తుందని ఖాద్రిని ఒప్పించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో నివాసం వెలుపల ఖాద్రి మద్దతుదారులు ఓ నేత కారుపై దాడి చేశారని సమాచారం. స్థానిక హజరత్ పీర్‌షా ఖాద్రి దర్గాకు చేరుకున్న మంత్రులు, నాయకులు ప్రార్థనలు చేశారు. జమీర్ తదితరులు చేసిన రాజీ ప్రయత్నం విఫలమైంది. ఖాద్రి చాకచక్యంగా ద్విచక్రవాహనంపై తాలూకా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన ఎన్నికల బరి నుంచి తప్పుకొంటారని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ బెంగళూరులో ధీమా వ్యక్తం చేశారు.

పద్మవ్యూహం ఛేదిస్తా

దళపతి నిఖిల్ ప్రతిన

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం పద్మవ్యూహాన్ని చక్రవ్యూహాలను ఛేదిస్తానని జనతాదళ్, భాజపా ఉమ్మడి అభ్యర్థి నిఖిల్ కుమారస్వామి ప్రతినబూనారు. తాత- మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవేగౌడ, తండ్రి- కేంద్ర మంత్రి కుమారస్వామి, భార్య రేవతితో కలిసి జేపీనగరలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పూజలు చేసుకున్నారు. చెన్నపట్టణ మొదటి నుంచి దళ్‌కు పట్టున్న నియోజకవర్గమని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో గెలుపు సాధించడమే లక్ష్యంగా ప్రచారాన్ని చేస్తానని తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు తాను చెన్నపట్టణలోనే ఉంటానని మాజీ ప్రధాని దేవేగౌడ ప్రకటించారు. ప్రచారానికి వెళ్లకుండా వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలతో వరుస సమావేశాలను నిర్వహిస్తానని ఆయన చెప్పారు.



హారతిని కళ్లకద్దుకుంటున్న దేవేగౌడ, కుమారస్వామి, నిఖిల్, రేవతి

భర్తను కడతేర్చిన భార్య

ఉడుపి, న్యూస్‌టుడే : విషాహారం పెట్టి బాలకృష్ణ పూజారి (44) అనే వ్యక్తిని హత్య చేసిన అతని భార్య ప్రతిమ, ఆమె ప్రియుడు దిలీప్ హెగ్డేను కార్కళ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. కామెర్ల బారిన పడిన అజెకారు నివాసి బాలకృష్ణ పూజారి పాతిక రోజులుగా వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. హఠాత్తుగా ఆయన ఒక రోజు నిద్రలో మరణించారు. కామెర్లతోనే అతను మరణించాడని అందరూ భావించారు. మృతుని ఒంటి రంగు మారడంతో అతని సోదరుడు అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు పూర్తి చేసి హంతకులను శుక్రవారం అరెస్టు చేశారు. విషాహారం పెట్టిన అనంతరం దుప్పటితో అతని మొహంపై అదిమి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారని పోలీసుల దర్యాప్తులో తేలింది.

బస్టాప్‌లో మహిళ అపహరణ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : పీణ్య సువర్ణనగర బస్టాప్ వద్ద ఓ మహిళ (32) గురువారం రాత్రి అపహరణకు గురైంది. కారులో వచ్చిన ఆరుగురు ఆమెను బెదిరించి, ఎక్కించుకుని పరారయ్యారని సత్యజిత్ చౌదరి అనే వ్యక్తి పీణ్య ఠాణాలో ఫిర్యాదు చేశారు.

అడ్డగోలు కట్టడాలపై గునపాలు



కురుబరహళ్లిలో కూల్చుతున్న ఇల్లు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను కూల్చివేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో బృహత్ బెంగళూరు మహానగర పాలికె అధికారులు శుక్రవారం స్పందించారు. బాబూసాపాళ్యలోని ఆరు అంతస్తుల భవంతి కూలి.. తొమ్మిది మంది మరణించడంతో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇళ్లు, అదనంగా కట్టిన అంతస్తులు, పునాదుల నుంచి పైవరకు గోడలు నెర్రెలు విచ్చితే.. ఇళ్లను ఖాళీ చేయాలని పాలికె అధికారులు సూచించారు. కురుబరహళ్లిలోని ఒక ఇంటి దిగువ అంతస్తు గోడ విరగడంతో ఆ భవంతిని శుక్రవారం కూల్చివేశారు. ఎక్కడైనా ఇక్కట్లుంటే ఇళ్లలో అద్దెకు ఉంటున్న వారు స్పందించి ఫిర్యాదులు చేయాలని పాలికె అధికారులు కోరారు. మురికివాడలు, రాజకాలువకు సమీపంలో ఉన్న పలు భవంతులు శిథిలావస్థకు చేరుకున్నాయని అధికారులు గుర్తించారు. కొన్ని అంతస్తులకు అనుమతులు తీసుకుని ఎక్కువ అంతస్తులను నిర్మించిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది.

భారీ నిర్మాణం కూల్చివేత

బెంగళూరు (శివాజీనగర): ఉద్యానగరిలోని హొరమావు నంజప్ప గార్డెన్‌లో 250 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఆరంతస్తుల భవంతి కూల్చివేత ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. భవంతి ఒక పక్కకు వాలడం.. గోడలకు నెర్రెలు రావడంతో దాన్ని కూల్చి వేయాలని పాలికె అధికారులు నోటీసులు జారీ చేశారు. కూల్చకపోతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని యజమాని పుట్టప్పకు ఇచ్చిన నోటీసుల్లో హెచ్చరించారు. విధిలేని పరిస్థితుల్లో పుట్టప్ప దాన్ని కూల్చి వేయించేందుకు ముందుకు వచ్చారు. అన్ని వలయాల్లో ఈ తరహా నిర్మాణాలను పరిశీలించాలని పాలికె అధికారులకు కమిషనర్ తుషార్ గిరినాథ్ సూచించారు. ఇకపై ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మరొకరి కన్నుమూత

బెంగళూరు (శివాజీనగర): బాబూసాపాళ్యలో ఆరంతస్తుల భవంతి కూలిన ఘటనకు బాధ్యులుగా భావిస్తున్న భువన్, మునియప్ప, మోహన్‌రెడ్డి, ఏళుమలై అనే వ్యక్తులను హెణ్ణూరు పోలీసులు న్యాయస్థానం ముందు గురువారం హాజరు పరిచారు. వారిని రెండు వారాల పాటు న్యాయనిర్బంధానికి పంపించాలని న్యాయమూర్తి ఆదేశించారు. మరోవైపు.. భవంతి శిథిలాల కింద నుంచి నుజ్జయిన ఒక మృతదేహాన్ని గురువారం రాత్రి బయటకు తీశారు. మృతదేహం నుజ్జు కావడంతో వివరాలను గుర్తించే ప్రయత్నాలను హెణ్ణూరు ఠాణా పోలీసులు తీవ్రం చేశారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఇప్పటికి తొమ్మిదికి చేరింది. మరో రెండు మృతదేహాలు శిథిలాల కింద ఉంటాయని అనుమానిస్తున్నామని బెంగళూరు పాలికె అధికారులు తెలిపారు.



కేవలం 250 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఇంటిని కూల్చుతున్న బుల్ డోజర్

'ఖనిజం' కేసు తీర్పు వాయిదా

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : బళ్లారి కేరి పోర్టు నుంచి ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తరలించిన ఆరోపణలు రుజువు అవడంతో ఎమ్మెల్యే సతీశ్ శైల్‌ను చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం ఇప్పటికే దోషిగా ప్రకటించింది. శిక్ష ప్రమాణాన్ని శుక్రవారం ప్రకటించవలసి ఉండగా.. శనివారానికి వాయిదా వేస్తున్నామని న్యాయమూర్తి సంతోశ్ గజానన ప్రకటించారు. సతీశ్ శైల్‌ను అపరాధిగా ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప పేర్కొన్నారు. ఈ కేసు 2009కి సంబంధించిందని, తీర్పును ప్రశ్నిస్తూ శైల్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారేమో వేచి చూడవలసి ఉందని హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ తెలిపారు.

కిడ్నాపర్లపై కాల్పులు

బెళగావి, న్యూస్‌టుడే : ఇంట్లోకి ప్రవేశించి పిల్లలను అపహరించుకుని పరారవుతున్న దుండగుల్లో ఒకనిపై అథణి ఠాణా పోలీసులు కాల్పులు జరిపారు. అతనితో కలిపి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. కొల్హాపురకు చెందిన సంబా కాంబ్లేకి తూటా తగిలి దొరికిపోగా, చిక్కోడికి చెందిన రవికిరణ కమ్లాకర, బిహారుకు చెందిన షారుక్‌ఖాన్‌లను ఇతర నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. ఈ దాడుల సమయంలో జమీర్ డాంగే, రమేశ్ హాదిమని అనే కానిస్టేబుళ్లు గాయపడ్డారు. అథణిలోని విజయ్ దేశాయి నివాసంలో ఇద్దరు బాలల్ని అపహరించుకుని వీరు పరారయ్యారు. సమాచారం అందుకుని నిందితులను పోలీసులు వెంబడించారు. మహారాష్ట్ర సరిహద్దు వద్ద చుట్టుముట్టారు. బంధించేందుకు వెళ్లిన కానిస్టేబుళ్లపై వారు దాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. కాల్పులు జరిపి ఒకడిని బంధించిన అనంతరం మిగిలిన ఇద్దరూ లొంగిపోయారు.

అంజలి కుటుంబానికి చేయూత

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : ఇటీవల హుబ్బళ్లిలో హత్యకు గురైన అంజలి అంబిగెరె అనే యువతి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రూ.5 లక్షల నగదు పరిహారాన్ని అందజేశారు. విమానాశ్రయానికి బాధితురాలి కుటుంబ సభ్యులను శుక్రవారం పిలిపించుకుని చెక్కు అందజేసి, ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిగ్గావి, సండూరు, చెన్నపట్టణల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఘన విజయాన్ని సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నేను చెన్నమ్మ అభిమాని!



ఉత్సవ వేదికపై సిద్ధరామయ్యకు స్మరణిక అందిస్తున్న నేతలు

బెళగావి, న్యూస్‌టుడే : నేను కిత్తూరు రాణి చెన్నమ్మ, సంగొళ్లి రాయణ్ణ అభిమానినని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. వారి నుంచే పోరాట స్ఫూర్తిని అలవర్చుకున్నానని చెప్పారు. కిత్తూరు రాణి చెన్నమ్మ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారితో పోరాటాన్ని చేసి 200 ఏళ్లయిన నేపథ్యంలో కిత్తూరు ఉత్సవాల ముగింపు సమావేశాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. చెన్నమ్మ విగ్రహానికి పూలహారం వేసి నివాళి అర్పించి మాట్లాడారు. దేశమంటే ప్రజలని, అన్ని ధర్మాల వారిని ప్రేమగా చూసుకోవాలని చెన్నమ్మ, రాయణ్ణ రెండు శతాబ్దాల కిందటే చాటి చెప్పారని గుర్తు చేశారు. వారి ఆశయాలను నేడు మనమంతా ఆచరించాలని పిలుపునిచ్చారు. కిత్తూరు రాణి చెన్నమ్మ ఉత్సవాలను ఘనంగా ఆచరించాలని మొదటిసారిగా మా ప్రభుత్వమే ఆదేశాలు ఇచ్చిందని గురు చేశారు. రాణి చెన్నమ్మ, ఝాన్సీ రాణి, రాణి అబ్బక్క, బసవేశ్వరుడు, ఒణకే ఓబమ్మ, అంబేడ్కర్ తదితరులందరినీ అభిమానిస్తానని చెప్పారు. మడివాళ రాజయోగీంద్ర స్వామి, మంత్రి శివరాజ్ తంగడగి, ఆయా పార్టీల నేతలు అశోక పట్టణశెట్టి, మహంతేశ కౌజలగి, ప్రకాశ్ హుక్కేరి, భరమగౌడ కాగెచ లక్ష్మణరావు జింగళె, కన్నడ ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తమ బిళిమలె తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

విచారణకు హాజరైన పార్వతి

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) నుంచి అక్రమంగా 14 ఇంటి స్థలాలను పొందారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి లోకాయుక్త అధికారుల ముందు శుక్రవారం విచారణకు హాజరయ్యారు. విచారణకు హాజరు కావాలని గురువారమే ఆమెకు నోటీసులు జారీ అయ్యాయి. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆమె విచారణను ఎదుర్కొన్నారు. ఈ కేసులో ఆమె ఏ2గా ఉన్నారు. లోకాయుక్త ఎస్పీ నేతృత్వంలోని అధికారులు ఆమెను ప్రశ్నించారు. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకూ ఆమె బదులిచ్చినట్లు సమాచారం.

కాలిపోయిన బస్సు

(మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బొమ్మనహళ్లి నుంచి ఎలక్ట్రానిక్ సిటీ వైపు వెళుతున్న బీఎంటీసీ బస్సులో శుక్రవారం రాత్రి మంటలు చెలరేగాయి. పొగలు, మంటల్ని గుర్తించిన డ్రైవరు తక్షణమే పక్కన నిలిపి బస్సు నుంచి 30 మంది ప్రయాణికులను కిందకు దించారు. రెండు వాహనాల్లో వచ్చిన అగ్నిమాపక దళ సిబ్బంది మంటల్ని అదుపు చేశారు. అప్పటికే సగానికి పైగా బస్సు కాలిపోయింది. బ్యాటరీలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం సంభవించిందని బొమ్మనహళ్లి ఠాణా పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

ఇద్దరిని చిదిమేసిన లారీ

విజయపుర: సొల్లాపుర రహదారిలో శుక్రవారం ఉదయం సంభవించిన రోడ్డుప్రమాదంలో అనిల్ చౌహాన్ (35), శివాజీ చౌహాన్ (40) అనే వ్యక్తులు మరణించారు. వీరిద్దరూ సమీప బంధువులు. వీరి బైకును ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది.

శ్రీమంతులే లక్ష్యంగా మత్తు బాణం

రూ.1.5 కోట్ల విలువైన సరకు స్వాధీనం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాజధాని నగరన పరిధి నెరళూరు లక్ష్మీసాగరలో ఉంటున్న చిక్దం లివోనస్ (32) అనే నైజీరియన్‌ను అరెస్టు చేసిన సీసీబీ పోలీసులు రూ.1.50 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అతని నుంచి ఎండీఎంఏ గుళికలు, ఎలక్ట్రానిక్ తూనిక యంత్రం, ద్విచక్ర వాహనాన్ని జప్తు చేసుకున్నామని నగర పోలీసు కమిషనర్ దయానంద్ వెల్లడించారు. ఆడుగోడి, న్యూ మైకో రోడ్, లక్కసంద్ర చుట్టుపక్కల ప్రాంతాల్లో యువత, టెకీలు, శ్రీమంతుల పిల్లలకు మాదక ద్రవ్యాలను విక్రయిస్తూ చివరకు పట్టుబడ్డాడని తెలిపారు.



నైజీరియన్ నుంచి స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలు చూపిస్తున్న నగర కొత్వాలు దయానంద్

అత్యాచారం కేసులో 30 ఏళ్ల జైలు శిక్ష

కలబురగి: బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలు రుజువు కావడంతో భీమాశంకర్ అంబిగెరె అనే నిందితుడికి 30 ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ కలబురగి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానం శుక్రవారం తీర్పుచెప్పింది. అత్యాచారానికి సహకరించిన అతని నలుగురు సహచరులకు తలా ఐదేళ్ల కారాగార శిక్షను విధిస్తూ న్యాయమూర్తి యమనప్ప బమ్మణగి తీర్పు ఇచ్చారు. జీవర్గి తాలూకాలోని ఒక గ్రామం పొలంలో ఉన్న బాలిక (15)ను తన సహచరులతో కలిసి 2022 జూన్ 4న కారులో అపహరించుకుని వెళ్లిన నిందితుడు ఆమెపై రెండుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అఫ్జలపురలోని ఒక హోటల్‌కు అల్పాహారం కోసం తీసుకువచ్చినప్పుడు అక్కడి నుంచి ఆమె తప్పించుకుంది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి నిందితులను అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

అత్తను కొట్టి చంపిన కోడలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : తన అత్త కెంపమ్మ (57)ను హత్య చేసిన ఉమాదేవి అనే కోడలిని, హత్యకు సహకరించిన ఆమె భర్త రాజేశ్‌ను హెబ్బూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. తుమకూరు జిల్లా సిర వరకు సమీపంలోని కల్లుపాళ్యకు చెందిన అత్తాకోడళ్లు కెంపయ్య, ఉమాదేవి మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. అత్తపై ఉమాదేవి దాడి చేస్తున్న సమయంలో కెంపమ్మ కుమారుడు కూడా తల్లిదే తప్పు అంటూ అతనూ కొట్టాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన కెంపమ్మను స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చిన కొంత సమయానికే ఆమె మరణించింది. మరణంపై అనుమానం వచ్చిన కెంపమ్మ కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుతో భార్యాభర్తలను అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

అట్టహాసంగా హనుమంత నామినేషన్ దాఖలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక భాజపా అభ్యర్థి బంగారు హనుమంత నామినేషన్ పత్రాలు శుక్రవారం దాఖలు చేశారు. మొదట అభ్యర్థి బంగారు హనుమంత, రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ మంత్రులు గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.దివాకర్, జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకాలు కుమారస్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అక్కడి నుంచి స్థానిక కూడ్లిగి రహదారిలోని ఏపీఎంసీ మార్కెట్ నుంచి ఓపెన్ లారీలో ఊరేగింపుగా బయలుదేరారు. దారి పొడవునా వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు గజమాలలు వేసి అభిమానం చాటుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు కె.ఎస్.ఆర్.టి.సి. బస్సు ప్రాంగణం వద్ద వాహనం నుంచి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బళ్లారి, విజయనగర జిల్లాల ఓటర్లు బి.శ్రీరాములును ఓడించలేదు. వాల్మీకి నిధులను అక్రమంగా మళ్లించి ఓటర్లకు పంచడం వల్ల కాంగ్రెస్ అభ్యర్థి ఇ.తుకారామ్ గెలుపొందారు. ఎంపీ ఒక్క క్షణం కూడా పదవిలో కొనసాగే నైతికత లేదన్నారు. సండూరు నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుతున్నారు. ఈ విధాన సభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి మంచి ఆధిక్యతతో గెలుపొందడం ఖాయమన్నారు. అనంతరం మాజీ మంత్రులు, అభ్యర్థి బంగారు హనుమంత కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. నామినేషన్ దాఖలు చేయడానికి పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజకీయ ప్రభావం ఉన్న రాజవంశస్తులైన ఎం.వై.ఘోర్పడే కుమారుడు కార్తీక్ ఘోర్పడే నామినేషన్ దాఖలు చేసే సమయంలో, విలేకరుల సమావేశంలోనూ కనిపించలేదు. స్థానికంగా ఉండే నేతలకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల దూరంగా ఉన్నట్లు పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

● తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు



ప్యాలెస్ వద్ద సందడి చేస్తున్న భాజపా నేతలు

చివరి రోజు మూడు నామినేషన్ పత్రాలు

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నికకు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి చివరి రోజు శుక్రవారం ముగ్గురు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. భాజపా అభ్యర్థి బంగారు హనుమంత, మూడు నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారికి అందజేశారు. కర్ణాటక జనతా పార్టీ అభ్యర్థి ఎస్.అంజినప్ప, స్వతంత్ర అభ్యర్థిగా టి.ఎం.మారుతి నామినేషన్ పత్రాలను తహసీల్దార్‌కు అందజేశారు. నామినేషన్ పత్రం సమర్పించే కార్యక్రమానికి పలువురు హాజరయ్యారు.

పార్టీలో అభిప్రాయభేదాలు లేవు

పార్టీలో ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవు.. అభ్యర్థి బంగారు హనుమంత సౌమ్యుడు, విద్యావంతుడు అని మాజీ మంత్రి బి.శ్రీరాములు తెలిపారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఎస్టీ అభివృద్ధి మండలి నిధులు అక్రమంగా మళ్లించి, ఎన్నికలకు రూ.21కోట్లు ఖర్చు చేయడంతో ఇ.తుకారామ్ గెలుపొందారు. మాజీ మంత్రి బి.నాగేంద్ర వ్యక్తిగత కార్యదర్శి విజయకుమార్ రాసిన పుస్తకంలో వివరాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకుని వెల్లడించారని తెలిపారు. నేను నియోజకవర్గానికి దూరంగా లేనని..నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన తర్వాత ప్రచారానికి రావాలని ఉంది. ఈ రోజు నామినేషన్ పత్రాలు దాఖలు పూర్తయ్యాయి. ఇంటింటి ప్రచారం చేసి భాజపా అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు.

ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల గెలుపు తథ్యం

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థులే గెలుపొందుతారు. దీనిపై ఎలాంటి అనుమానం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర ధీమా వ్యక్తం చేశారు. సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల సందర్భంగా భాజపా అభ్యర్థి బంగారు హనుమంత నామినేషన్ దాఖలు చేయడానికి విచ్చేసిన విజయేంద్ర ఎం.వై.ఘోర్పడే ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఉప ఎన్నికల్లో రాష్ట్రంలో రాజకీయ మార్పులు రానున్నాయి. ఎన్నికల ఫలితాలు తర్వాత కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వస్తాయన్నాయి. 18 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైంది. మూడు నియోజకవర్గాల్లో భాజపా, జేడీఎస్ అభ్యర్థులు గెలుపొందుతారని తెలిపారు. రాష్ట్రంలో వాల్మీకి అభివృద్ధి మండలి నిధులు మళ్లింపు, ముడా అక్రమాలతో రాష్ట్ర ప్రజలు విసుగుచెందారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై వ్యతిరేకత ప్రారంభమైంది. జాతుల మధ్య మర్గలను సృష్టిస్తున్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని మరిచిపోయారు. గ్యారంటీలను గెలిపిస్తాయని భుజాలు ఎగరేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 19 స్థానాల్లో గెలుపొందినట్లు తెలిపారు. దళిత, గిరిజన వ్యతిరేక ప్రభుత్వం ఇంటికి పోవాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. శ్రీరాములుతో మాకు ఎలాంటి అసంతృప్తి లేదు. సండూరు నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ఈ సారి తమ పార్టీ అభ్యర్థి బంగారు హనుమంతు అధిక్యతతో గెలుపొందుతారని జోస్యం చెప్పారు. ఈ క్షేత్రం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని ఇ.తుకారామ్ అభివృద్ధిని మరిచారు. ఎస్టీ సముదాయం ప్రజలు రాజకీయంగా ముందుకు రావాలని రిజర్వేషన్ తీసుకుని వచ్చారు. ఎస్టీ రిజర్వేషన్ కేవలం ఇ.తుకారామ్ కుటుంబానికి పరిమితమైందని, చాలా మంది అసంతృప్తితో ఉన్నారన్నారు. ఎన్నికలకు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. కేంద్ర మంత్రి భగవంత్ కూబా, శాసనసభ్యుడు సునీల్, మాజీ మంత్రులు గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, మాజీ ఎమ్మెల్యేలు గాలి సోమశేఖర్‌రెడ్డి, అనిల్ హెచ్.లాడ్, భాజపా అభ్యర్థి బంగారు హనుమంత, జి.టి.పంపాపతి, రామలింగప్ప, హనుమంతప్ప పాల్గొన్నారు.



నామినేషన్‌ను దాఖలుకు ఊరేగింపుగా వస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, అభ్యర్థి బంగారు హనుమంత, మాజీ మంత్రి బి.శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి, కె.ఎస్.దివాకర్ తదితరులు



కార్యక్రమానికి తరలివచ్చిన అభిమానులు

ఓటర్ల నుంచి మంచి స్పందన వస్తోంది

భాజపా అభ్యర్థి బంగారు హనుమంత పేరు ప్రకటించిన తర్వాత 40 నుంచి 50 గ్రామాల్లో ప్రచారం చేశాం. గ్రామీణ ప్రాంతాల ఓటర్ల నుంచి మంచి స్పందన వస్తోందని మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సారి సండూరు నియోజకవర్గం చరిత్ర తిరిగి రాస్తాం. దీనిపై ఎలాంటి అనుమానం లేదు. ఈ క్షేత్రం ఎస్టీ సముదాయం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి సముదాయానికి చెందిన ఎస్టీ నిధులను లూటీ రాజు బి.నాగేంద్ర మళ్లించారు. నియోజకవర్గానికి డీఎంఎఫ్, కేఎంఈఆర్‌సీ నిధులు ఉన్నాయి. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో రూ.250 కోట్లతో సండూరు-హొసపేటె, సండూరు-కూడ్లిగి, సండూరు-కుమారస్వామి దేవాలయానికి రహదారులు వేశాం. నేటికీ చెక్కుచెదరలేదన్నారు.

అన్నపూర్ణ కుటుంబ ఆస్తులు రూ.3.24కోట్లు

● అప్పులు రూ.31.22 కోట్లు



కాంగ్రెస్ అభ్యర్థి ఇ.అన్నపూర్ణ

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నపూర్ణ సమర్పించిన నామినేషన్ పత్రంలో రూ.9లక్షల రుణం తీసుకున్నట్లు వివరించారు. ఆమెకు సొంత కారు లేదు. ద్విచక్రవాహనం ఉన్నట్లు పత్రంలో పేర్కొన్నారు. అన్నపూర్ణకు ఎలాంటి కేసులు లేవు. ఆమె బి.ఎ. వరకు చదివారు. ప్రస్తుతం అన్నపూర్ణ వద్ద రూ.2.57 లక్షల నగదు, భర్త, బళ్లారి లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ వద్ద రూ.1.50 లక్షల నగదు ఉన్నట్లు వెల్లడించారు. మూడు పొదుపు ఖాతాల్లో రూ.26.50 లక్షలు ఉన్నాయి. భర్త మూడు వేర్వేరు ఖాతాల్లో రూ.14.60 లక్షలు కలిగి ఉన్నారు. అభ్యర్థికి జీవిత బీమా పాలసీ ఉంది. భర్త పేరు మీద రెండు పాలసీలు ఉన్నాయి. అన్నపూర్ణకు మొత్తం వారసత్వం ఆస్తి విలువ రూ.44.37 లక్షలు కాగా, తుకారామ్‌కు రూ.1.48 కోట్లు వచ్చినట్లు వివరించారు. సండూరు పట్టణం యశ్వంత్‌నగర్‌లో అన్నపూర్ణ పేరు మీద సొంత ఇల్లు ఉంది. రూ.2.97లక్షల విలువైన సామగ్రి, కంప్యూటర్లు ఉన్నాయి. అన్నపూర్ణ స్థిరాస్తి రూ.63.21లక్షలుగా చూపించారు. భర్త స్థిరాస్తి విలువ రూ.47.66లక్షలుగా చూపించారు. అన్నపూర్ణ తన భర్త వద్ద రూ.9లక్షలు అప్పుగా తీసుకుంది. ఇతర వ్యక్తుల నుంచి రూ.10.25 లక్షలు, తుకారామ్ స్నేహితులు, బంధువుల వద్ద రూ.30లక్షల అప్పు తీసుకున్నట్లు స్థిరాస్తి వివరాల్లో పేర్కొన్నారు. కొడుకు చదువు కోసం రూ.15 లక్షల అప్పు తీసుకున్నట్లు వెల్లడించారు. అన్నపూర్ణ మొత్తం ఆస్తులు రూ.3.24 కోట్లుగా అఫడవిట్‌లో చూపించారు.



సాహితీవేత్త శ్రీకంఠయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కన్నడ సాహిత్యానికి వెలుగులు దిద్దిన శ్రీకంఠయ్య

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: కన్నడ సాహిత్యానికి నూతన రూపురేఖలతో వెలుగులు దిద్దిన సాహితీ పిపాసి బి.ఎం.శ్రీకంఠయ్య అని కర్ణాటక క్రియాశీల ఉపాధ్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. సంజీవరాయన కొటె ప్రభుత్వ పాఠశాలలో బి.ఎం.శ్రీ సాహిత్య సేవలు అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 20వ శతాబ్దంలో ఆంగ్ల సాహిత్యానికి దీటుగా..కన్నడ సాహిత్యం ఎదుగుదలకు కృషి చేసిన కవులు, సాహితీవేత్తలకు ధైర్యం నింపిన మహనీయుడన్నారు. షేక్స్పియర్ ఆంగ్ల సాహిత్యాన్ని కన్నడలో అనువదించి సాహితీ పిపాసిగా ఎదిగారన్నారు. శ్రీకంఠయ్య జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నగర సీటును అమ్ముకున్నారు

బళ్లారి, న్యూస్‌టుడే: నేను కాంగ్రెస్ పార్టీ నిజమైన కార్యకర్తగా పనిచేశాను. బళ్లారి నగర ఎమ్మెల్యే సీటును ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అమ్ముకున్నారని మాజీ ఎమ్మెల్యే అనిల్ హెచ్.లాడ్ ఆరోపించారు. భాజపా అభ్యర్థి బంగారు హనుమంత నామినేషన్ పత్రం దాఖలు చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి బళ్లారి నగరం కోసం ఉప్పు సత్యాగ్రహం చేశారా? ఏమైనా ఘన కార్యం చేశారా? హెచ్.ఆర్.గవియప్ప కూడలిలో 135 అడుగుల కటౌట్‌ను ఏర్పాటు చేశారు. నగరంలో ఎక్కడ చూసినా బ్యానర్లు, ఫ్లెక్సీలు వేశారు. వేర్వేరు రాజకీయ నేతలు నగర పాలికెలో బ్యానర్లు, ఫ్లెక్సీలు వేస్తే నగర పాలికె అధికారులు తొలగిస్తారు. ప్రస్తుతం ఎందుకు తొలగించలేదన్నారు. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తండ్రి నారా సూర్యనారాయణరెడ్డి ఏమైనా ఘన కార్యం చేశారా అని విలేకరులను ప్రశ్నించారు. నేను రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో సండూరు తాలూకా అభివృద్ధికి రూ.1.90 కోట్లు కేటాయించాను. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడుగా ఎంపికైన డా.సయ్యద్ నాసీర్ హుసేన్ బళ్లారి అభివృద్ధికి నిధులు ఎన్ని కేటాయించారని ప్రశ్నించారు. ఆయన కలబురిగి, బీదర్ వంటి జిల్లాలకు నిధులు విడుదల చేస్తున్నారు. బళ్లారి అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అనిల్ హెచ్.లాడ్ తదితరులు

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: మొళకాల్మూరు తాలూకా బిజికెర గ్రామం వద్ద బళ్లారి- బెంగళూరు రహదారిలో క్రూజర్ వాహనం టైరు పంక్చరు కావడంతో దాన్ని మారుస్తున్న వారిపై వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొనడంతో కలబురగి జిల్లా ఆళంద తాలూకా ఒళవండి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (45) అనే వ్యక్తి ప్రమాద స్థలం వద్దనే మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం జరిగిందని పోలీసులు తెలిపారు. శుక్రవారం వారు తెలిపిన వివరాల మేరకు.. ఒళవండి గ్రామానికి చెందిన 9 మంది కూలి కోసం క్రూజర్ వాహనంలో బెంగళూరుకు వెళ్తుండగా వాహనం టైరు పంక్చరైంది. వాహనాన్ని దారి పక్కన నిలిపి చక్రాన్ని మారుస్తుండగా వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ దుర్ఘటనలో చంద్రశేఖర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, వాహన చోదకుడు బసవరాజ్ (28) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని మొళకాల్మూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

వాగులో కొట్టుకుపోయి మరొకరు..

చెళ్లకెర(చిత్రదుర్గం): అరళీకట్టె గ్రామానికి చెందిన జయణ్ణ(45) అనే వ్యక్తి హిరేహళ్ల వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగిందని పోలీసులు తెలిపారు. సంగేనహళ్లి చెరువు నిండటంతో చూసిన తర్వాత వాగు దాటేందుకు ప్రయత్నించారు. స్నేహితులు ఎంత వారించినా వినకుండా జయణ్ణ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న ప్రవాహంలో దిగడంతో అదుపు తప్పి వాగులో కొట్టుకుపోయారు. చరవాణుల వెలుగులో వెతికినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం అగ్నిమాపకదళం సిబ్బంది బోటులో గాలించగా కంప చెట్ల మధ్య మృతదేహాన్ని గుర్తించారు.



ప్రమాదం ధాటికి దూరంగా పడి మృతి చెందిన విద్యార్థి షేక్షావలి

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరి దుర్మరణం

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా జవళగేరి వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న రహదారి ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సీఎస్ఎఫ్ చర్చి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొనడంతో ఈ దారుణం జరిగింది. వాహనాలు నడుపుతున్న ఇద్దరూ అసువులు బాసారు. సింధనూరు కళాశాలలో పీయూసీ చదువుతున్న షేక్షావలి (19), జవళగేరి ముదియప్ప (45) ప్రమాదంలో చనిపోగా మృతదేహాలను సింధనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు వాహనాలకు వెనుక కూర్చున్న ఇద్దరికి కాళ్లు విరిగి తీవ్ర గాయాలవగా వాళ్లను రాయచూరు ఆసుపత్రికి తరలించారు. బెళగానూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



మొక్కజొన్న చేనులో నిలిచిన వరదనీరు

1,660 ఎకరాల్లో పంటల నష్టం



వేరుసెనగ కాయల ఊడలు కుళ్లిపోయాయని చూపుతున్న రైతు రవికుమార్

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర తాలూకాతోపాటు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు 1,660 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ మంజునాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. 780 ఎకరాల్లో మొక్కజొన్న, 595 ఎకరాల్లో వేరుసెనగ, 195 ఎకరాల్లో కందులు, 42 ఎకరాల్లో పత్తి, 27 ఎకరాల్లో నష్టం కలిగిందన్నారు. అతివృష్టితో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది మొక్కజొన్న 2.55 లక్షల ఎకరాలు, వేరుసెనగ 2.67 లక్షలు, రాగి 1.10 లక్షలు, తృణధాన్యాలు 76.21 వేల ఎకరాలు, కందులు 52 వేలు, పత్తి 20 వేల ఎకరాల్లో కలిపి 7.97 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేసినట్లు వివరించారు.

ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ బోల్తా

మాన్వి: మాన్వి తాలూకా చికల్‌పర్వి నుంచి బసవనబాగేవాడి వెళుతున్న ఇసుక టిప్పర్ గొల్లదిన్ని గ్రామం మారెమ్మదేవి దిబ్బ వద్ద బోల్తా పడింది. వాహన చోదకుడు మంజునాథ్, క్లీనర్ అర్జున స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని సిరివార ఎస్సై అమరేగౌడ పరిశీలించారు. రోడ్డుకు అడ్డంగా పడిన వాహనాన్ని పక్కకు తీసి వాహన సంచారానికి ఇబ్బంది లేకుండా చేశారు.



రోడ్డుపై పల్టీకొట్టిన టిప్పర్

బేలేకెరె కేసులో మలుపు

● ఇద్దరు హొసపేటె వాసుల అరెస్టు



స్వస్తిక్ నాగరాజ్



కారపుడి మహేశ్

హొసపేటె, న్యూస్‌టుడే: బేలేకెరె ఓడరేవులో ఇనుప ఖనిజాన్ని మాయం చేసిన కేసులో నిందితులైన ప్రస్తుతం నగరసభ సభ్యుడు కారపుడి మహేశ్, మరో వ్యాపారి స్వస్తిక్ నాగరాజ్‌లను లోకాయుక్త పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడు ఎమ్మెల్యే సతీశ్ శైల్‌ను అరెస్టు చేసిన వెనువెంటనే హొసపేటెలోనూ ఇద్దరిని అరెస్టు చేశారు. ఇదే కేసులో మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ హస్తమూ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన స్థానికంగా లేరు. బేలేకెరె ఓడరేవు నుంచి అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేస్తున్న సుమారు 88 లక్షల టన్నుల ఇనుప ఖనిజాన్ని ఓడరేవు అధికారులు స్వాధీనం చేసుకుని, నిల్వ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే సతీశ్‌శైల్ సహకారంతో ఆ నిల్వను అక్రమంగా విదేశాలకు తరలించినట్లు లోకాయుక్త దర్యాప్తులో తేలింది. గనుల కుంభకోణం కేసులో మాజీ మంత్రి జనార్దన్ రెడ్డి 2011లో అరెస్టయ్యారు. తరువాత కొద్ది రోజులకే బేలేకెరె ఓడరేవు కేసుకు సంబంధించి హొసపేటె వాసులైన కారపుడి మహేశ్, స్వస్తిక్ నాగరాజ్‌లను లోకాయుక్త పోలీసులు అదుపులో తీసుకున్నారు. అదే సమయంలో వారి ఇళ్లపైన ఆదాయపు పన్ను అధికారులూ దాడులు చేయడం సంచలనాన్ని సృష్టించింది. జైలు ఊచలు లెక్కపెట్టి బయటకు వచ్చిన స్వస్తిక్ నాగరాజ్ హొసపేటె తాలూకా డణాపుర వద్ద ఓ స్పాంజ్‌ఐరన్ కర్మాగారం నెలకొల్పారు. కారపుడి మహేశ్ నగరసభ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. వీరిద్దరి అరెస్టు గనుల వర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

కరెకల్లు చెరువుకట్ట మరమ్మతుల పరిశీలన

చెళ్లకెర,న్యూస్‌టుడే: చెళ్లకెర శివార్లలోని కరెకల్లు చెరువుకట్టకు గండ్లు పడి మూడుచోట్ల నీరు వృథాగా కిందకు వెళ్తోందని, గండ్లను మూసివేయడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రఘుమూర్తి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన కరెకల్లు చెరువుకట్ట వద్ద మరమ్మతులను పరిశీలించి మాట్లాడారు. కుండపోత తలపించేలా వర్షాలు కురవడంతో చెరువుకు పైభాగాన ఉన్న చెక్‌డ్యాంలు తెగిపోయి ఒక్కసారిగా వరదనీరు ప్రవేశించడంతో చెరువుకట్టలో అధికంగా నీరు వచ్చిందని తెలిపారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొంటున్నారన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రెహాన్ పాష, రెవెన్యూ అధికారి తిప్పేస్వామి, నారాయణరెడ్డి, వీరేశ్, అంజనప్ప ఉన్నారు.



కరెకల్లు చెరువుకట్ట మరమ్మతులను పరిశీలించిన ఎమ్మెల్యే రఘుమూర్తి, తదితరులు

భాజపా నేతలకు ఉజ్జని పీఠం స్వామీజీ ఆశీర్వాదం

హొసపేటె, న్యూస్‌టుడే: సండూరు ఉప ఎన్నికలు వేడెక్కాయి. విజయం కోసం అధికార, ప్రతిపక్షం అభ్యర్థులు, వారి గెలుపు బాధ్యతను భుజాన మోసుకున్న నాయకులు చెమటోడ్చటం ప్రారంభించారు. పలు వర్గాలను ప్రసన్నం చేసుకోవటానికి కసరత్తులు, తెరవెనుక మంతనాలు ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం విజయనగర జిల్లా కొట్టూరులో ఉన్న ఉజ్జని పీఠం మరుళసిద్ధరాజ దేశీకేంద్ర స్వామీజీని పలువురు భాజపా నాయకులు కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. పార్టీ రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర, మాజీ మంత్రులు రేణుకాచార్య, బి.శ్రీరాములు ఉన్నారు.



కొట్టూరులోని ఉజ్జని పీఠం మరుళసిద్ధరాజ దేశీకేంద్ర స్వామీజీ ఆశీర్వాదం తీసుకుంటున్న భాజపా నాయకులు

ఘనంగా నారా భరత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర నియోజకవర్గ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్న నారా భరత్‌రెడ్డి, బళ్లారి కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో నగర పాలికె పౌరకార్మికులకు సమవస్త్రాలు వితరణ చేశారు. నగర పాలికె కార్యాలయంలో ప్రతిభావంత విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించారు. హవంబావి, ఏపీఎంసీ, బాపూజీనగర, శ్రీరాంపురం కాలనీ, కాకర్లతోట, హెచ్.ఆర్.గవియప్ప కూడలి, తాళూరు రహదారి, మిల్లర్‌పేటె, రేడియో పార్క్, ఇర్షాద్ అలి బాబా దర్గా, కౌల్‌బజార్‌లోని అభిమానుల మధ్య కేకు కోసి భోజనం ఏర్పాటు చేశారు. పలువురు అభిమానులు, కార్పొరేటర్లు, నేతలు, అధికారులు, సిబ్బంది నారా భరత్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కంప్లి ఎమ్మెల్యే గణేశ్, జడ్పీ మాజీ సభ్యుడు శ్రీనివాసరావు(వాసు), ఏపీఎంసీ అధ్యక్షుడు నాగేంద్ర, మేయర్ ముల్లంగి నందీష్ తదితరులు ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



కేకు కోసి విద్యార్థులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



ఎద్దుల బండిపై ఊరేగింపుగా వెళ్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

హంపీలో ఆక్రమణల తొలగింపు

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ విరూపాక్ష ఆలయం కుడివైపు నిర్మించిన అనధికారిక కట్టడాలు, హోటళ్లను శుక్రవారం ప్రాధికారం, జిల్లా యంత్రాంగం అధికారులు కూల్చివేశారు. ఏడు నెలల క్రితం ఈ ప్రాంతంలోని అనధికారిక రిసార్టులను మూసివేయడం తెలిసిందే. ప్రస్తుతం ఇళ్లు, వ్యాపార సంకీర్ణాలను కూల్చివేస్తున్నారు. హొసపేటె తహసీల్దార్ శ్రుతి మళ్లప్పగౌడ నేతృత్వంలో ప్రాధికారం, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొని నిర్మాణాలను కూల్చివేశారు. తాఖీదులు ఇవ్వకుండా ఉన్నఫళంగా కట్టడాలను కూల్చివేయడం దారుణమని హంపీ స్థానికులు వాదనకు దిగారు. వారం క్రితమే ఆక్రమణల తొలగింపుపై జిల్లా యంత్రాంగం నిర్ణయాలు తీసుకుంది. తాఖీదులు ఇవ్వడం ఆలస్యమైందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. కొంత సమయాన్ని ఇస్తే, స్వయాన నిర్మాణాలను కూల్చివేస్తామని స్థానికులు కోరడంతో అనుమతి ఇచ్చారు. అంతలో కొన్ని నిర్మాణాలను యంత్రాలు కూల్చివేశాయి. హంపీ, కమలాపుర పోలీసులు కూల్చివేత ప్రాంతంలో మకాం వేశారు.



భవనాన్ని కూల్చివేస్తున్న కార్మికులు



హంపీ విరుపాక్ష ఆలయం పక్కనే ఉన్న ప్రాంతంలో వెలిసిన ఇళ్లు, దుకాణాలను కూల్చివేస్తున్న కార్మికులు

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు

బస్సుల సంచారం ప్రారంభం



భారీ వాహనాలు రాకుండా ఉండేందుకు వంతెన వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లికోటె వంతెనపై శుక్రవారం ఉదయం నుంచి బస్సుల సంచారం ప్రారంభమైంది. తుంగభద్రకు వరద రావడంతో మంగళవారం ఉదయం నుంచి వంతెనపై వాహన సంచారం నిలిపివేసి ద్విచక్ర వాహనాలు, పాదచారులను అనుమతించారు. వరద తగ్గడంతో గురువారం మధ్యాహ్నం నుంచి కార్లు, ఆటోల వంటి చిన్న వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి బస్సుల సంచారం ఆరంభమైంది. ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన కావడంతో ముందు జాగ్రత్తగా తాత్కాలికంగా లారీలు ఇతర భారీ వాహనాల సంచారాన్ని నిలిపివేశారు.

కిత్తూరు ఉత్సవంలో ఆకట్టుకున్న గానం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: బెళగావి జిల్లా కిత్తూరు ఉత్సవంలో నగరానికి చెందిన ప్రముఖ జానపద గాయకుడు యల్లనగౌడ శంకరబండ బృందం జానపద పాటలను ఆలపించి ప్రేక్షకులను శ్రవణానంద పరిచారు. ఈ సందర్భంగా యల్లనగౌడ మాట్లాడుతూ జానపద పాటలను ప్రేక్షకులు ఆదరించారని తెలిపారు. అధికారులు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. యల్లనగౌడను నగరంలోని కళా సంస్థల ప్రతినిధులు అభినందించారు.



బెళగావి కిత్తూరు ఉత్సవాల్లో పాటలను ఆలపిస్తున్న యల్లనగౌడ శంకరబండ తదితరులు

పర్యావరణ హిత దీపావళి ఆచరించండి

బళ్లారి, న్యూస్‌టుడే: దీపావళి పండగ సందర్భంగా నిషేధిత పటాకులు కాల్చకుండా పరిసర పటాకులు కాల్చి పర్యావరణ హిత దీపావళిని జరుపుకోవాలని జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో దీపావళి సందర్భంగా పరిసర పటాకులు మాత్రమే కాల్చాలి. రాత్రి 8 నుంచి 10 గంటలలోపు బాణసంచా కాల్చాలన్నారు. చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బంది లేకుండా పండగను జరుపుకోవాలన్నారు.

దక్షిణ వలయ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు దుర్గా అఖిల్

కంప్లి, న్యూస్‌టుడే: చెన్నైలో శనివారం నుంచి జరుగనున్న దక్షిణ వలయ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు బళ్లారి శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ విద్యార్థి, కంప్లికి చెందిన ఎం.దుర్గా అఖిల్ ఎంపికయ్యారు. క్రీడాకారులు నవీన్, అమిత్, ఓం దుబే, వినాయక్‌తో పాటు పోటీలో పాల్గొన్నారు.



ఎంపికైన దుర్గా అఖిల్ (చిత్రంలో నిలుచున్న వారిలో ఎడమ నుంచి రెండో వ్యక్తి)

నవంబరు 16న ఉద్యోగుల సంఘం ఎన్నికలు

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నవంబరు 16న నిర్వహిస్తామని ఎన్నికల అధికారి లియాకత్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి నవంబరు 7 వరకు నామినేషన్ సమర్పణ, 8న పరిశీలన, 11న నామినేషన్ పత్రాల ఉపసంహరణ ప్రక్రియ జరుగుతుంది. పట్టణంలోని సండూరు మార్గంలో ఉన్న ఉద్యోగుల భవనంలో నామపత్రాలను సమర్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటింగ్ తరువాత అదే రోజు లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.51 వేల విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన జగదీష్

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకాలోని మెట్రి గ్రామ పంచాయతీ పరిధి ఉప్పారహళ్లి గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి వీరశైవ లింగాయత మహా వేదిక జిల్లా అధ్యక్షుడు హెచ్.జగదీష్ శుక్రవారం రూ.51 వేల విరాళం అందించారు. నాయకులు హొన్నూర్ శంకర్, జడెప్ప, మోహన్, నాగరాజ్, మాయప్ప, హనుమంత గౌడ, ఆలయ సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



రోగికి పండ్లు, రొట్టె అందిస్తున్న హొసకోటె జగదీష్

కంప్లి, న్యూస్‌టుడే: బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి 34వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కంప్లి ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెట్రి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు హొసకొటె జగదీష్ మాట్లాడుతూ సమాజ సేవకు తన వంతు కృషి చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. వివిధ సంఘ సంస్థల సహకారంతో కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. బీడీసీసీ బ్యాంకు నిర్దేశకుడు మూకయ్య స్వామి, నాయకులు ఇటిగి బసవరాజ గౌడ, అరవి బసవనగౌడ, కరి బసవన గౌడ, బళె మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల వర్గీకరణలో ఏకపక్ష వైఖరి తగదు

గంగావతి,న్యూస్‌టుడే: రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో ఏకపక్ష వైఖరి తగదని రిజర్వేషన్ల సంరక్షణా సమాఖ్య అభ్యంతరం తెలిపింది. సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సమర్థనీయంకాని గణాంకాల ఆధారంగా చేపట్ట తలపెట్టిన వర్గీకరణను రాష్ట్ర మంత్రిమండలి తిరస్కరించాలని కోరారు.



జిల్లా పాలనాధికారి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రిజర్వేషన్ల సంరక్షణా సమాఖ్య ప్రతినిధులు

గంగరాజు నివేదికను ప్రకటించాలన్నారు. వర్గీకరణకు ముందు శాస్త్రీయ అధ్యయనం అవసరం ఉందన్నారు. 2011 జనాభా లెక్కలను కాకుండా ఇటీవలి కులాల గణనను ప్రాతిపదికగా తీసుకోవాలన్నారు. ఎస్సీలకు చెందిన 101 సముదాయాల్లో 51 కులాల వెనుకబాటుతనం అధ్యయనానికి నిపుణుల సమితిని ఏర్పాటు చేయాలన్నారు. సమితి నివేదిక అనంతరం 101 కులాల ప్రతినిధుల ఫిర్యాదులను ఆలకించి తరువాత వర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలన్నారు. ధర్నాలో బసవరాజ్ బోవి, పి.లక్ష్మణనాయక్, భరతనాయక్, గాళెప్ప బోవి, కంబణ్ణ భజంత్రి, సత్యప్ప బోవి పాల్గొన్నారు.

బీసీఏఏ అధ్యక్షుడిగా శీలాబ్రహ్మయ్య

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: బళ్లారి సాంస్కృతిక వ్యవహారాల సంఘం(బీసీఏఏ) అధ్యక్షుడిగా శీలా బ్రహ్మయ్య మరోసారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల పదవీకాలానికి పదాధికారులను నియమించామని తెలిపారు. ఉపాధ్యక్షులుగా పూజారి గాదెప్ప, వి.రామచంద్ర, అవ్వారు మంజునాథ్, కార్యదర్శిగా యశ్వంత్‌రాజ్, సహ కార్యదర్శులుగా రామకృష్ణ, రామమూర్తి, ప్రకాష్ కోశాధికారిగా డా.మల్లేష్, 22 మంది కార్యవర్గసభ్యులు, 10 మందిని విశేష ఆహ్వానితులు మూడేళ్లపాటు సేవలందిస్తారని వివరించారు.

శిక్షపడ్డ నిందితుడు ఆకస్మిక మృతి

గంగావతి,న్యూస్‌టుడే: మరకుంబి దళితులపై దౌర్జన్యం కేసులో శిక్షపడ్డ నిందితుల్లో ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి 24న కొప్పళ జిల్లా న్యాయస్థానం శిక్ష విధించిన తెలిసిందే. 98 మందికి యావజ్జీవ, ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. తీర్పు ప్రకటించగానే ఐదేళ్లు శిక్షపడ్డ ముగ్గురిలో ఒకరు రామణ్ణ బోవి(44) న్యాయస్థానంలోనే కుప్పకూలి పడిపోయాడు. వెంటనే అతన్ని కొప్పళ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక రామణ్ణ శుక్రవారం ఉదయం మృతిచెందాడు.



రామణ్ణ బోవి

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

25-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.93	1610.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	48,221	84
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	48,314	9,775
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.500	37.785

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

సండూరు..హోరాహోరీ పోరు

● ఇరుపార్టీల అభ్యర్థుల ప్రకటన ● మొదలైన రాజకీయపుటెత్తులు ● నేతల మధ్య భగ్గుమంటున్న అసంతృప్తి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, భాజపా అభ్యర్థులను ప్రకటించాయి. టికెట్ కోసం ఆశిస్తున్న పలువురు రెబల్‌గా మారడంతో ఒక్కసారిగా అభిప్రాయభేదాలు భగ్గుమంటున్నాయి. సండూరు నియోజకవర్గం 2008లో ఎస్టీకి రిజర్వేషన్ కావడంతోపాటు లోక్‌సభ నియోజకవర్గం ఎస్టీకి రిజర్వు చేశారు. ఈ ఏడాది మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఇ.తుకారామ్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఎన్నికల కమిషన్ నవంబరు 13న ఎన్నికల తేదీని ప్రకటించింది. టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి అన్నపూర్ణ తుకారామ్, తుమటి లక్ష్మణ్, శివరామ్ భీమేష్, భాజపా నుంచి మొత్తం 19 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో కె.ఎస్.దివాకర్, బంగారు హనుమంత, వై.దేవేంద్రప్ప, అప్పణ్ణల మధ్య టికెట్ కోసం తీవ్ర పోటీ జరిగింది. వారిలో కాంగ్రెస్ పార్టీ నుంచి అన్నపూర్ణ, భాజపా నుంచి బంగారు హనుమంత పేర్లు ప్రకటించింది. టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన వారు ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇస్తారా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది.



కాంగ్రెస్ అభ్యర్థి ఇ.అన్నపూర్ణ



భాజపా అభ్యర్థి బంగారు హనుమంత

కాంగ్రెస్‌లో భగ్గుమన్న అసంతృప్తి

సండూరు నియోజకవర్గం ఎస్టీకి రిజర్వు చేసింది. రిజర్వేషన్ ఎంపీ తుకారామ్ కుటుంబ సభ్యులకే పరిమితమైందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు భగ్గుమంటున్నారు. ఎంపీ ఇ.తుకారామ్‌కు అత్యంత ఆప్తుడిగా ఉంటున్న యరదమ్మనహళ్లి ఎన్.వెంకణ్ణ ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. తుమటి లక్ష్మణతో పాటు పలువురు టికెట్‌ను ఆశించారు. ఇ.తుకారామ్‌కు వ్యతిరేకంగా బెంగళూరుకు వెళ్లారు. మంత్రి సంతోష్ ఎస్.లాడ్ నచ్చజెప్పి పంపించారు. వారు పార్టీ అభ్యర్థి గెలుపునకు ఎలా శ్రమిస్తారోనని పెద్ద ప్రశ్నగా మారింది. భాజపా అభ్యర్థి బంగారు హనుమంత పేరు పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి బంగారు గెలుపును తన భుజాలపై వేసుకుని ప్రచారం తీవ్రం చేశారు. 2012 నుంచి సండూరులో ఉంటూ. .పార్టీ అభివృద్ధికి శ్రమించిన కె.ఎస్.దివాకర్ నిరాశకు గురయ్యారు. పార్టీలో నిజమైన కార్యకర్తగా పనిచేస్తూ వచ్చారు. పార్టీ అధిష్ఠానం 5 వేల మంది సభ్యత్వం చేయాలని సూచించగా, తాలూకాలో 9,800 మందితో సభ్యత్వం చేయించారు. సామూహిక వివాహాలు చేయించారు. మారథాన్ వంటి కార్యక్రమాలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలకు దగ్గరయ్యారు. పార్టీ అభ్యర్థికి కె.ఎస్.దివాకర్ ఎలా పనిచేస్తారు అనేది పెద్ద ప్రశ్న.. బంగారు హనుమంత గెలిస్తే నియోజకవర్గానికి భవిష్యత్తులో ఆయనకే పార్టీ టికెట్ ఇచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని, స్థానిక పార్టీ నేతలు పనిచేస్తారా? లేదా అనేది పార్టీ నేతలను కలవరపడుతున్నారు.

అన్నపూర్ణ రాజకీయ అరంగేట్రం

సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఇ.అన్నపూర్ణ మొదటి సారిగా రాజకీయ ప్రవేశం చేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో భర్త ఇ.తుకారామ్ తరపున ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలతో మంచి సంబంధాలు ఉన్నాయి. అన్నపూర్ణ హొసపేటె తాలూకా కమలాపురం గ్రామానికి చెందిన మాళిగి రుద్రప్ప, మాళగి కమలమ్మ దంపతులకు 1974 ఆగస్టు 31న జన్మించారు. ప్రాథమిక విద్యా కమలాపురంలో పూర్తి చేశారు. కువెంపు విశ్వవిద్యాలయంలో బి.ఎ.పూర్తి చేశారు. సండూరుకు చెందిన ఇ.తుకారామ్‌తో వివాహమైంది. సమాజ సేవలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎంపీ తుకారామ్ రాజకీయంలో కుడి భుజంగా ఉంటున్నారు. మంచి కవయిత్రి కూడా..ఎంపీ తుకారామ్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో నియోజకవర్గ ప్రజలతో మంచి సంబంధాలు ఉన్నాయి. మంత్రి సంతోష్ ఎస్.లాడ్ ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఎత్తులు వేయడంతో మంత్రి దిట్ట. ఆయన ఎత్తులు ఈసారి ఎలా పనిచేస్తాయోనని నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

మహిళలకు యోగాభ్యాసం తప్పనిసరి



యోగా శిబిరార్థులకు ఆరోగ్యంపై సూచనలు ఇస్తున్న ఆయుర్వేద కళాశాల ప్రాధ్యాపకురాలు శిల్పా ఎస్.తెగ్గి

హొసపేటె, న్యూస్‌టుడే: మహిళలు 40 ఏళ్ల తరవాత యోగాభ్యాసం చేయడం తప్పనిసరి అని స్థానిక ఆయుర్వేద కళాశాల ప్రాధ్యాపకురాలు డాక్టర శిల్పా ఎస్.తెగ్గి పేర్కొన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నాలుగు పదుల వయస్సు దాటిన తరువాత మహిళల్లో పలు ఆరోగ్య సమస్యలు వస్తాయి. వాటిని అదుపులో పెట్టుకోవాలంటే కనీసం గంటసేపు యోగాభ్యాసం చేయాలని సూచించారు. హార్మోన్ల విడుదల్లో హెచ్చుతగ్గులు సంభవించినప్పుడు పలు సమస్యలు వస్తాయని హెచ్చరించారు. పప్పు ధాన్యాల్లో ఎక్కువ శాతం ఫైటో ఈస్ట్రోజన్ ఉంటుంది, వాటిని తరచూ తినాలని సూచించారు. 7 నుంచి 9 గంటలు నిద్ర పోవాలని తెలిపారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు, ఉపాధ్యాయులు

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచి క్రీడల్లో పాల్గొంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ పేర్కొన్నారు. తాలూకా క్రీడా మైదానంలో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో తాలూకా స్థాయి, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల క్రీడలను ఇతర అతిథులతో కలిసి మొక్కకు నీరు పోసి ప్రారంభించి ఆమె మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో పాల్గొంటే అన్ని విధాలుగా బలంగా ఉండి అన్ని రంగాల్లో రాణించేందుకు దోహద పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, పరుగు పందెం, కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్, త్రోబాల్ పోటీల్లో తమ సత్తా చాటారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కరిబసప్ప, విద్యాశాఖ సంయోజకుడు తమ్మనగౌడ పాటిల్, మారుతి, క్రీడా ఉపాధ్యాయులు వై.డి.వెంకటేశ్, రమేశ్, ఈరణ్ణ, ఉస్మాన్, కిరణ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండరీపురానికి పాదయాత్ర

కారటగి, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రం పండరీపురానికి కారటగి నుంచి 80 మంది భక్తులు శుక్రవారం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. స్థానిక లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. తలేఖాన్ మఠ వీరభద్ర శరణరు పాదయాత్రను ప్రారంభించారు. పాండురంగ రుక్మిణి ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ ఇది 8వ సంవత్సర పాద యాత్ర. ఇళకల్, హునగుంద, బసవన బాగెవాడి, విజయపుర, మంగళ ఖేడ మీదుగా నవంబరు 9న పండరీపురం చేరుకుంటామని తెలిపారు.



పాదయాత్రగా పండరీపురం వెళుతున్న భక్తులు

యువత ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి

మాన్వి, న్యూస్‌టుడే : యువతీ యువకులు ఆత్మ విశ్వాసం, పట్టుదలతో కృషి చేస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారని హానగల్ లయోలా వికాస్ కేంద్రం నిర్వాహకులు ఫాదర్ జెరాల్డ్ పేర్కొన్నారు. స్థానిక లయోలా కళాశాలలో 'నవసమాజం కోసం యువతీ యువకులు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యం, జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సంస్థ చేయూత ఇస్తుందన్నారు. వారికి ఆసక్తి ఉన్న రంగంలో తర్ఫీదునిచ్చి, జీవితంలో స్థిరపడే విధంగా కృషి చేస్తుందన్నారు. వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించటం, వృత్తి మార్గదర్శనం చేయటం తదితర అంశాలపై తర్ఫీదు ఇస్తున్నట్లు వివరించారు. సదస్సులో 40 మంది యువకులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న యువకులు

కేడీపీ సమితిలో ఇద్దరు తెలుగు యువకులు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా పంచాయతీ (కేడీపీ త్రైమాసిక పరిశీలనా సమితి)కి సింధనూరు తాలూకాలోని ఇద్దరు తెలుగు యువకులు నామినేట్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యోజనా కార్యక్రమ సంయోజన-సాంఖ్యక శాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సమితికి మొత్తం ఆరుగురు నామినేట్ సభ్యులను నియమించింది. ఇందులో భీమరాజ్ క్యాంపు కోయలమూడి నరేంద్ర, రైతునగర్ క్యాంపు వీఎంఆర్.రవీంద్రరెడ్డి ఉన్నారు. మరియప్ప జాలిహాళ, వెంకోబ జిన్నద్ కల్లూరు క్రాస్, హనీఫ్ సాలగుంద, వీణ వీరనగౌడ గోనవార తదితరులు ఇతర సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర, రవీంద్రలకు వివిధ తెలుగు క్యాంపుల పెద్దలు అభినందనలు తెలిపారు.



కోయలమూడి నరేంద్ర, భీమరాజ్ క్యాంపు



వీఎంఆర్ రవీంద్రనాథ్ రెడ్డి రైతునగర్ క్యాంపు

రైతులకు హక్కుపత్రాల మంజూరులో జాప్యం

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టణ, గ్రామీణ పరిధిలోని జంబునాథ హళ్లి, రాజాపుర, ఇంగళగి ప్రాంతాల్లో చాలా ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వడంలో జిల్లా యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నట్లు ఆరోపిస్తూ శుక్రవారం కర్ణాటక ప్రాంతం రైతు సంఘం ప్రముఖులు స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద నిరసన చేపట్టారు. ఆందోళనకు నేతృత్వం వహించిన సంఘం జిల్లాధ్యక్షుడు యల్లాలింగ మాట్లాడుతూ సర్వే నం.114, 185లో తాతల కాలం నుంచి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వాటికి సంబంధించి చేతిరాతల్లో ఉన్న దాఖలాలు రైతుల వద్ద ఉన్నాయి. వాటిని పరిశీలించి, రైతులకు హక్కుపత్రాలు ఇవ్వాలని ఏడాది నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదని వాపోయారు. 1964 భూ సవరణ చట్టం కింద దళిత, గిరిజనులకు ఉచితంగా వ్యవసాయ భూమిని కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. ఆ భూముల్లో వ్యవసాయం చేస్తున్న రైతులకు వెంటనే హక్కుపత్రాలు ఇచ్చేలా జిల్లా యంత్రాంగానికి సిఫార్సు చేయాలి, అప్పటి వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదని వారు కోరారు. సంఘం ప్రముఖులు కొటిగి మల్లికార్జున, కరి హనుమంత, రాజాపుర కణిమెప్ప పాల్గొన్నారు.



సమస్యను ఎమ్మెల్యే గవియప్పకు వివరిస్తున్న రైతు సంఘం అధ్యక్షుడు యల్లాలింగ



కొండకోనల్లో కానవచ్చే ఇలాంటి జలపాతాలకు లెక్కేలేదు..

పర్యాటకం



ప్రమాదకరమైన మలుపులతో కూడిన కొండదారి

అందాల గుమ్మం.. ఆగుంబె!

● చినుకుల రాసి.. మన చిరపుంజీ ● వారాంతం.. మహా విహార విలాసం

బెంగళూరు (యశ్వంతపురం), న్యూస్‌టుడే : చూడ చక్కని పడమటి కనుమలు.. ఆ వైపు తీర ప్రాంతానికి చేరుకోవడానికి దట్టమైన కీకారణ్య మార్గం.. ప్రయాణమే ఓ మధురానుభూతుల సంగమం! ఆ విహార విలాసంలో కీలక మజిలీ ఆగుంబె! మలెనాడు పాదప్రాంతం శివమొగ్గ నుంచి తీర ప్రాంత జిల్లాలకు పయనం.. ఆగుంబెను తాకకుండా సాగదు. కొండల శిఖరాగ్రాన విరాజిల్లే చిరు గ్రామమే ఆగుంబె! ఏడాదిలో అత్యధిక రోజులు వర్షంతో తడిచిముద్దయ్యే కుగ్రామాన కాసేపు విశ్రమించి.. చినుకుల రాగాలని ఆలపించి.. సెలయేటి గీతాలకు తలలూపి సాగిపోవడం పర్యాటకుడి మధుర పుటల్లో చెరగిపోని ఘట్టం. వానల్లో రికార్డులకెక్కి- దక్షిణాది చిరపుంజీగా ఖ్యాతి పొందిన ఆగుంబెలో వానలేని సమయమేదో గుర్తించడం ఒకింత కష్టమేనంటారు. సెప్టెంబరు నెలలో ఏకంగా 2500 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడమే ఆ ఘనతకు తార్కాణం. ఫిబ్రవరి మినహా మిగతా నెలల్లో రెండు వేల మిల్లీమీటర్ల నుంచి ఆపై స్థాయిలో నాలుగు వేల మిల్లీమీటర్ల వరకు ఇక్కడ గరిష్ఠంగా వర్షపాతం నమోదువుతుంటుంది. ఆ ప్రదేశాన్ని తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. నగర, పట్టణవాసులు ప్రత్యేకంగా వాహనాల్లో తరలి వెళ్లి, పూటకూళ్ల నివాసాల్లో విశ్రమించి వానలో తడిచి ముద్దై.. వెనుతిరగడం ఓ అనుభూతికి తార్కాణం. ఇపుడూ ఆగుంబె కిటకిటలాడుతోంది. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా విహారానికి వస్తున్నవారెందరో. ఇక వారాంతాల్లో ఆ సందడి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వానలకు భయపడే ఆగుంబె కొండ (ఘాట్) రహదారుల్లో భారీ వాహనాల సంచారాన్ని తాత్కాలికంగా నిషేధించారు. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా పరిధిలోని పడమటి కనుమల పరిధిలో ఈ చిరుగ్రామం ఆగుంబె చూడొచ్చు. అరేబియా సముద్ర మట్టానికి 2165 అడుగులు ఎత్తులో విస్తరించింది. ఇక్కడి పర్వతశ్రేణి చివరి దాకా వెళితే.. అరేబియా సముద్ర అలల హొయలు చూడొచ్చు. ఆ సుందర దృశ్యాన్ని చూడటానికే సందర్శకుల కోసం అటవీశాఖ ప్రత్యేక వంతెన నిర్మించింది. ఐదువందల మందితో కూడిన ఈ చిన్నగ్రామం మూడు చదరపు కిలోమీటర్ల పరిధిలో.. చెట్ల మధ్య విస్తరించింది. ఇది అతి ఎత్తైన ప్రదేశం కావడంతో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చుట్టు పక్కల ఉన్న బర్కానా, ఒనకే అబ్బి, జోగిగుండి, కూడ్లు తీర్థ, సిరిమనే, శ్రీమనే జలపాతాలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రకృతి అందాలను తిలకించేందుకు విదేశీయులు వచ్చి వెళుతున్నారు. జలపాతాలు, వాగుల్లో విహరిస్తున్నారు. 'మాల్గుడి డేస్' సీరియల్ చిత్రీకరించిన- 150 ఏళ్ల కిందట నిర్మించిన ఇళ్లు నేటికీ ఇక్కడ చెక్కు చెదరలేదు. ఫిబ్రవరిలో మాత్రమే ఆగుంబెలో పొడి వాతావరణం ఉంటుంది. అత్యంత తేమగా జులైలో చిత్తడిని తలపిస్తుంది. దట్టమైన వెండి పొగమంచు వానాకాలానికే ప్రత్యేకం. ఆ అందాల ఆస్వాదనలో ప్రస్తుతం పర్యాటకులు ఆనందంగా సాగుతున్నారు!



ఆగుంబె గ్రామ పరిసరాల్లో కానవచ్చే ఎత్తైన పర్వతశ్రేణులు



ప్రకృతి వైభవాన్ని తిలకించడానికి ఉపకరించే వంతెన

ముదిమి వయస్సులో దొరికిపోయాడు

మంగళూరు, న్యూస్‌టుడే : సూరత్కల్ సమీపంలోని రక్షక్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూట్‌లో మూడు దశాబ్దాల కిందట కాపలాగా ఉన్న నారాయణ అనే కాపలాదారును హత్య చేసి పరారైన జోస్ కుట్టి (95) అనే వ్యక్తిని సీసీబీ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. సంస్థలో 1995 మార్చి 12న దొంగతనానికి వచ్చిన జోస్ కుట్టి, అచ్చన్ కుంజి అక్కడ కాపలాగా ఉన్న నారాయణ, మరో ఇద్దరిపై దాడి చేసి, దొంగతనానికి పాల్పడి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన నారాయణ చికిత్స పొందుతూ మరణించాడు. వారిలో అచ్చన్ కుంజి ఎనిమిదేళ్ల కిందట మరణించాడు. కేరళ ఎర్నాకుళం జిల్లా ప్రిప్పుళిత్తురంలో జోస్ కుట్టి ఉన్నట్లు గుర్తించి, అరెస్టు చేసి శుక్రవారం మంగళూరు నగరానికి తీసుకువచ్చారు.

'మావోయిస్టు' విచారణ బాధ్యతలు ఎన్ఐఏకి..

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : గత నెల ఆరో తేదీన బెంగళూరు నగరంలో ఉంటున్న స్నేహితురాలిని కలిసేందుకు వచ్చి దొరికిపోయిన మావోయిస్టు అనిరుద్ధ రాజన్ విచారణ బాధ్యతలను జాతీయ దర్యాప్తు దళం (ఎన్ఐఏ) చేపట్టింది. ఇప్పటి వరకు సీసీబీ అదనపు పోలీసు కమిషనర్ చంద్రగుప్త నేతృత్వంలోని సిబ్బంది విచారించడం గమనార్హం. నిందితుడికి ఆంధ్ర, తెలంగాణ, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమ బంగ్లా తదితర ప్రాంతాల్లో జరిగిన నేరాలకు సంబంధం ఉండడంతో దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏకు అప్పగించాలని కేంద్ర హోం శాఖ సూచించింది. దీంతో దర్యాప్తు బాధ్యతలు, ఇప్పటి వరకు చేసిన విచారణ వివరాలను ఎన్ఐఏకు అప్పగించామని చంద్రగుప్త తెలిపారు.

తమ్ముడి భార్యపై పెట్రోలు పోసి.. నిప్పు

మంగళూరు, న్యూస్‌టుడే : ఆస్తి వివాదానికి సంబంధించి జయభారతి (56) అనే మహిళపై పెట్రోలు పోసి ఆమె బావ శంకరనాయక్ (65) నిప్పంటించి కడతేర్చాడని రేవునగరి పోలీసులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలు చికిత్స పొందుతూ శుక్రవారం ఆసుపత్రిలో మరణించింది. బెళ్లారె ఠాణా పోలీసుల కథనం ప్రకారం.. ఏడాది కిందట భర్త చనిపోయిన అనంతరం జయభారతి సుళ్య తాలూకా కొడియాల గ్రామం వద్ద కల్లర్పెలో తన బావ శంకరనాయక్ ఇంటికి వచ్చి ఉంటోంది. శంకర్‌నాయక్ భార్య కొన్నేళ్ల కిందటే మరణించింది. ఇద్దరు పిల్లలూ విదేశాల్లో ఉంటున్నారు. వారి మధ్య ఏ వివాదం తలెత్తిందో.. గురువారం రాత్రి ఆమెపై పెట్రోలు పోసి నిందితుడు పరారయ్యాడు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆమె మరణించింది. పరారైన నిందితుడిని గాలింపు పూర్తి చేసి బెళ్లారె ఠాణా పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

బడుగు జనుల 'నివేదిక'కు దిక్కేదీ?

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : సామాజిక, విద్యా సమీక్ష నివేదికను తక్షణమే అమలు చేయాలని కర్ణాటక అణగారిన సముదాయాల మహా సమాఖ్య డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను బెంగళూరులోని 'కావేరి నివాసం'లో గురువారం సాయంత్రం సమాఖ్య ప్రతినిధులు భేటీ అయ్యారు. సుమారు రూ.159 కోట్లు ఖర్చు చేసి చేయించిన సమీక్షను అమలు చేయడం ద్వారా అణగారిన వర్గాలకు చెందిన వారి అభివృద్ధికి నిధులు విడుదల చేసేందుకు అవకాశం ఉంటుందని మాజీ మంత్రి బీటీ లలితా నాయక్ పేర్కొన్నారు. బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే సమానత్వాన్ని ప్రతిపాదించగా, నాల్వడి కృష్ణరాజ ఒడెయరు కూడా రిజర్వేషన్లను, బాలికా విద్యను ప్రోత్సహించారని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి దేవరాజ అరసు తన హయాంలో హావనూరు కమిషన్ ఏర్పాటు చేసి వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కావలసిన సదుపాయాలను కల్పించేందుకు అధ్యయనాన్ని చేయించారని గుర్తు చేశారు. తదుపరి మంత్రివర్గంలో చర్చించి, ఈ నివేదిక అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మహా సమాఖ్య ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. మహా సమాఖ్య ప్రధాన కార్యదర్శి కేఎం రామచంద్రప్ప, ప్రతినిధులు మావళ్లి శంకర్, అనంతనాయక, ఎణ్ణెగెరె వెంకటరామయ్య, కేఎస్ మృత్యుంజయప్ప, రవి మాకళి తదితరులు సీఎంను భేటీ అయిన వారిలో ఉన్నారు.



వినతిపత్రాన్ని అందుకుంటున్న సిద్ధరామయ్య

పశుగ్రాసం సాగుతో లాభాలు దండి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రైతులు తమ పొలంలో కొంత భాగాన్ని వివిధ రకాల గడ్డిని పెంచుకోవాలని బీదర్‌లోని పశు వైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కేసీ వీరణ్ణ పిలుపునిచ్చారు. తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే అజోలా, నేపియర్ జాతి గడ్డితో పశువులు ఎక్కువ పాలు ఇస్తాయని, మేకలు, గొర్రెలు బలంగా తయారవుతాయని గుర్తు చేశారు. హెబ్బాళలోని పశువైద్య కళాశాల ఆవరణలోని బాలుర హాస్టల్ మైదానంలో ఏర్పాటు చేసిన మేత మేళాను శుక్రవారం ప్రారంభించారు. బెంగళూరు గ్రామీణం, రామనగర, కోలారు, చిక్కబళ్లాపుర, తుమకూరు జిల్లాల నుంచి రైతులు, గొర్రెలు, మేకల సాగులో ఉన్న వారు మేళాలో పాల్గొన్నారు. సొంతంగా గడ్డి సాగుతో పాడి రైతులు ఖర్చును నియంత్రించుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. వివిధ రకాల గడ్డి జాతుల విత్తనాలను పలు సంస్థల ప్రతినిధులు ఇక్కడి స్టాళ్లలో విక్రయించారు. కర్ణాటక పశువైద్య శాల, మత్స్యశాఖ, భారతీయ డెయిరీ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మేళాలో వివిధ సంఘాలు, వర్సిటీల ప్రతినిధులు, అధికారులు డాక్టర్ హెచ్ఎం జయప్రకాశ్, వసంత బిరాదర్, డాక్టర్ వెంకటాచల, డీహెచ్ లత, శ్రీరూప, సంగప్ప, బసవరాజ ఆవటి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు అడిగిన ప్రశ్నలకు ఆచార్యులు బదులివ్వడంతో పాటు గడ్డి పెంపకంలోని మెలకువలను వివరించారు.



వివిధ రకాల గడ్డిని ప్రదర్శిస్తున్న అధికారులు, ఆచార్యులు



గడ్డి విత్తనాల వివరాలు తెలుసుకుంటున్న రైతులు



వివిధ రకాల పశువుల మేత చూస్తున్న రైతులు

అట్టహాసంగా హనుమంత నామినేషన్

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక భాజపా అభ్యర్థి బంగారు హనుమంత నామినేషన్ శుక్రవారం పత్రాలు దాఖలు చేశారు. మొదట అభ్యర్థి బంగారు హనుమంత, రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ మంత్రులు గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.దివాకర్, జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకాలు కుమారస్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అక్కడి నుంచి స్థానిక కూడ్లిగి రహదారిలోని ఏపీఎంసీ మార్కెట్ నుంచి ఓపెన్ లారీలో ఊరేగింపుగా బయలుదేరారు. దారి పొడవునా వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు గజమాలలు వేసి అభిమానం చాటుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు కె.ఎస్.ఆర్.టి.సి. బస్సు ప్రాంగణం ముందు వాహనం నుంచి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బళ్లారి, విజయనగర జిల్లాల ఓటర్లు బి.శ్రీరాములును ఓడించలేదు. వాల్మీకి నిధులను అక్రమంగా మళ్లించి ఓటర్లకు పంచడం వల్ల కాంగ్రెస్ అభ్యర్థి ఇ.తుకారామ్ గెలుపొందారు. ఎంపీ ఒక్క క్షణం కూడా పదవిలో కొనసాగే నైతికత లేదన్నారు. సండూరు నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుతున్నారు. ఈ విధానసభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి మంచి ఆధిక్యతతో గెలుపొందడం ఖాయమన్నారు. అనంతరం మాజీ మంత్రులు, అభ్యర్థి బంగారు హనుమంత కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. నామినేషన్ దాఖలు చేయడానికి పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజకీయ ప్రభావం ఉన్న రాజవంశస్తులైన ఎం.వై.ఘోర్పడే కుమారుడు కార్తీక్ ఘోర్పడే నామినేషన్ దాఖలు చేసే సమయంలో, విలేకరుల సమావేశంలోనూ కనిపించలేదు. స్థానికంగా ఉండే నేతలకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల దూరంగా ఉన్నట్లు పార్టీ నేతలు మాట్లాడుతున్నారు.



నామినేషన్‌ను దాఖలు చేయడానికి ఊరేగింపుగా వస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, అభ్యర్థి బంగారు హనుమంత, మాజీ మంత్రి బి.శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి, కె.ఎస్.దివాకర్ తదితరులు

ఆత్మీయ సమావేశానికి 'తెలుగు'దండు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : 'బెంగళూరు తెలుగుదేశం ఫోరం' ఆదివారం నిర్వహించనున్న ఆత్మీయ సమావేశానికి సంబంధించిన పోస్టరును విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి పట్టభద్రులై, కర్ణాటకలో ఉంటున్న వారు తమ నియోజకవర్గానికి వెళ్లి ఓటు వేసే విధంగా జాగృతి కల్పిస్తామని ఫోరం ప్రతినిధులు తెలిపారు. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే తెదేపా సభ్యత్వ కార్యక్రమాన్ని తమ ఫోరం కార్యాలయంలో శనివారం నుంచి నిర్వహిస్తున్నారు. రూ.వందతో సభ్యత్వాన్ని నమోదు చేసుకునే ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, వారి కుటుంబ సభ్యులకు విద్య, ఉపాధి తదితరాలకు సహాయం అందుతుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పేరబత్తుల రాజశేఖర్‌లను గెలిపించుకునేందుకు కర్ణాటకలో ఉంటున్న పట్టభద్రులు ముందుకు రావాలని ఫోరం ప్రతినిధులు కోరారు. పోస్టరు విడుదల చేసిన వారిలో ఫోరం ప్రతినిధులు లెనిన్, భార్గవ్, శ్రీకాంత్, వెంకటేశ్, ఇర్ఫాన్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



గోడపత్రాన్ని ప్రదర్శిస్తున్న టీడీఎఫ్ ప్రతినిధులు

వాహన చోరుల ఆటకట్టు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కుమారస్వామి లేఅవుట్, మడివాళ ఠాణా పోలీసుల కార్యాచరణలో నిర్వహించి ముగ్గురు వాహనచోరులు దొరికిపోయారు. శివరాజ్ (57), సయ్యద్ అబ్దుల్ (27), రమీజ్ (25) అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి రూ.18 లక్షల విలువైన 31 బైకులను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వాహనాలకు నంబరు ప్లేట్లు, ఇతర దాఖలాలను మార్చి ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరలకు విక్రయించుకుని సొమ్ము చేసుకునేవారని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

శివమొగ్గ, న్యూస్‌టుడే : నిదిగె సమీపంలో గురువారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో రాహుల్ (17) అనే బాలుడు, చైతన్య (23) అనే యువకుడు మరణించాడు. తేజస్వి (24) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వీరు ముగ్గురూ విద్యానగర నివాసులు. ఒకే బైకుపై వెళుతున్న వీరిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొని వెళ్లడంతో ప్రమాదం సంభవించింది. శివమొగ్గ గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హెగ్గడే జీవితమే 'ధర్మ'పథం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : కన్నడ జాతీయ కవి కువెంపు ప్రస్తావించిన విశ్వమానవ సందేశాన్ని తన సేవలద్వారా ప్రపంచానికి చాటుతున్న మహా వ్యక్తి ధర్మస్థల ధర్మాధికారి డాక్టర్ వీరేంద్రహెగ్గడే అని కార్కళ జైనమఠ అధ్యక్షుడు చారుకీర్తి భట్టారక స్వామీజీ శ్లాఘించారు. జైన- హైందవ ధర్మాలకు ఆయనే వారధిగా నిలిచారని కొనియాడారు. ఆయన స్థితప్రజ్ఞుడని కీర్తించారు. ధర్మస్థల ధర్మాధికారి డాక్టర్ వీరేంద్రహెగ్గడే 57వ పట్టాభిషేక మహోత్సవం గురువారం రాత్రి భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంలో వివిధ మఠాధిపతులు, ప్రముఖులు సభకు హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బెంగూళూరు గ్రామీణ లోకసభ సభ్యుడు డాక్టర్ సీఎన్ మంజునాథ్ ప్రసంగిస్తూ మానసిక ఆరోగ్యానికి అందరూ ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అన్ని ధర్మాలవారికీ ఆధ్యాత్మిక కేంద్రంగా ధర్మస్థల విరాజిల్లుతోందన్నారు. డాక్టర్ హెగ్గడే జీవనశైలిని కొనియాడారు. ఆయన క్రమశిక్షణ, శాంతిజీవనం, సదాచిరునవ్వు, సంయమనం, ఉదారత.. తదితర సద్గుణాలు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, మనసులో ప్రశాంత కాంతిరేఖ ఆయనకే సొంతమని వివరించారు. ఇదే వేదికపై డాక్టర్ హెగ్గడే మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ధర్మస్థలలో ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి అనేక సౌకర్యాలు విస్తరిస్తున్నామని ధర్మాధికారి వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దేశంలో 120 రూడ్‌సెట్ సంస్థలను త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు.



డాక్టర్ హెగ్గడే మైనపు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మంజునాథ్



ధర్మస్థల ప్రత్యేకతలు వివరించే ప్రదర్శనను వీక్షిస్తున్న డాక్టర్ మంజునాథ్, డాక్టర్ హెగ్గడే

విద్యతోనే అసమానతల అంతం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : విద్యతోనే అసమానతలు తొలగిపోతాయని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. అన్ని కులాలు, మతాలకు చెందిన వారు తమ బిడ్డలను విద్యావంతులను చేసేందుకు కంకణం కట్టాలని పిలుపునిచ్చారు. డాక్టర్ అంబేడ్కర్ సాంకేతిక విశ్వవిద్యాలయంలో కొత్తగా నిర్మించిన ఇండోర్ క్రీడా మైదానాన్ని, మొదటి ఏడాది ఇంజినీరింగ్ తరగతులను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. అవకాశ వంచితులను సమాజంలోని ప్రధాన స్రవంతికి తీసుకువచ్చేందుకు అందరికీ విద్యాబుద్ధులు చెప్పించేందుకు హాస్టళ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలను తమ ప్రభుత్వం కల్పిస్తూ వస్తోందని గుర్తు చేశారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు అంబేడ్కర్ పడిన శ్రమను విద్యార్థులను తెలియజేశారు. రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి అసమానతలు క్రమేణా తగ్గుముఖం పడుతూ వచ్చాయని తెలిపారు. సమాజంలో కుల వ్యవస్థ బలంగా వేళ్లానుకోవడంతోనే వైరుధ్యత, అసమానతలు ఎక్కువ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు, దళితులు, వెనుకబడిన వారు, అల్పసంఖ్యాకులకు ఆర్థిక, సామాజిక న్యాయం దక్కినప్పుడే నవ సమాజ స్థాపన సాధ్యమవుతుందని వివరించారు. మనిషి మరో మనిషిని ద్వేషించకూడదని, ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కొందరు రాజ్యాంగాన్ని మార్చేందుకు విఫలయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పారిశ్రామికాభివృద్ధికి అనుగుణంగా విద్యార్థులు కౌశల్యాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆశయాలను దృష్టిలో ఉంచుకుని 1980లో ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేడ్కర్ సాంకేతిక విశ్వవిద్యాలయంలో నాణ్యతతో కూడిన బోధన ఉందన్నారు. ఇంజినీర్లుగా పట్టభద్రులు అవుతున్న వారిలో తక్షణమే 15 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్నాయని చెప్పారు. కౌశల్య అభివృద్ధితోనే 60 శాతం వరకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, వర్సిటీ ఆచార్యులు, ఉపకులపతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాజ్యాంగ నిబంధనలను పాటిస్తామంటూ ప్రమాణం చేస్తున్న మంత్రి, ముఖ్యమంత్రి, ఇతర ప్రతినిధులు

మాయగాడికి కటకటాలు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : ఆసుపత్రి ఆవరణలోని ఒక కారు నుంచి రూ.13.75 లక్షల విలువైన నగదు, ఆభరణాలు ఉన్న వ్యానిటీ బ్యాగును చాకచక్యంగా దొంగిలించిన సయ్యద్ వాసిఫ్ (56) అనే నిందితుడ్ని హెణ్ణూరు ఠాణా పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. విజయమ్మ అనే మహిళ హొరమావులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన సోదరిని పరామర్శించేందుకు గత నెల 19న వెళ్లారు. కారులోనే నగదు, నగలు ఉన్న బ్యాగ్‌ను వదలి సోదరిని పరామర్శించి వచ్చే సరికి దొంగతనం జరిగింది. ఆమె ఫిర్యాదుతో ఆసుపత్రి ఆవరణలోని సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించి, గాలింపు చేపట్టి నిందితుడి అరెస్టు చేశారు.

వీధి శునకాల దాడి

కోలారు : శ్రీనివాసపుర తాలూకా రోణూరు, చుట్టుపక్కల గ్రామాల్లో వీధి శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. చిక్కతిమ్మనహళ్లి, రోణూరు, రొడ్డంపల్లి తదితర గ్రామాల్లో పిచ్చి కుక్కలు పది మందిని కరిచి గాయపరిచాయి. చికిత్స కోసం వీరిలో కొందరిని కోలారు జిల్లా సుపత్రిలో, మిగిలిన వారిని శ్రీనివాసపుర తాలూకా ఆసుపత్రిలో చేర్పించారు.

తల్వార్లతో హల్‌చల్

మంగళూరు : బంట్వాళలో గురువారం అర్ధరాత్రి కొందరు యువకులు తల్వార్లతో హల్‌చల్ చేశారు. తస్లీమ్, మన్సూర్ అనే యువకులు ఒకరిపై మరొకరు దాడి చేసుకుని గాయపరుచుకున్నారు. ఈ ఘటనను మరికొందరు చరవాణిలో రికార్డు చేసుకున్నారు. తస్లీమ్, మన్సూర్‌లను చికిత్స కోసం బంట్వాళ తాలూకా ఆసుపత్రిలో చేర్పించారు. దాడిలో పాల్గొన్న ముస్తాక్, ఆష్రఫ్, రిజ్వాన్, సఫ్వాన్, అద్నాన్, నిసాక్, సుహైల్, జాహిద్, సాదిక్, లతీఫ్‌లు పరారీలో ఉన్నారని గుర్తించారు.

'మైసూరు' టికెట్ల ధర పెంపు

మైసూరు, న్యూస్‌టుడే : విశ్వవిఖ్యాత మైసూరు ప్యాలెస్ ప్రవేశ ధరలను పెంచుతూ ప్యాలెస్ పాలక మండలి ఆదేశాలు జారీ చేసింది. పెద్దలకు రూ.100, బాలలకు రూ.70, విదేశీ పర్యాటకులకు రూ.1000 టికెట్ ధరగా నిర్ణయించింది. పదేళ్లలోపు చిన్నారులకు ప్రవేశాన్ని ఉచితం చేసింది. ఎడ్యుకేషనల్ టూర్‌కు వచ్చే విద్యార్థులకు రూ.50 టికెట్ ధర ప్రకటించారు. ఈ ధరల పెంపు శుక్రవారం నుంచే అమలులోకి రాగా.. వీటిలోనే జీఎస్టీ కలిసి ఉంటుంది. పాదరక్షల స్టాండ్, లగేజ్ గది, మరుగుదొడ్డి వినియోగానికి ఇప్పటి వరకు నగదు వసూలు చేస్తుండగా.. ఇకపై ఈ సేవలను ఉచితంగా వినియోగించుకోవచ్చని ప్యాలెస్ పాలక మండలి సూచించింది.



బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

గంగమ్మకు పూజలు


బోరుబావిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమశేఖర్ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: యశ్వంతపుర విధాన సభా క్షేత్రం దొడ్డబిదరకల్లు వార్డు చిక్కనాయకనపాళ్యలో బోరు బావిని ప్రారంభించి, గంగమ్మకు పూజలు చేశారు. హేరోహళ్లి ఎమ్మెల్యే కార్యాలయంలో కె.గొల్లహళ్లి పరిధిలోని నిత్యానంద నగర నివాసులకు ఆశ్రయ పథకం కింద హక్కు పత్రాలను ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ అందజేశారు. ఇంటింటికీ తాగునీటి సరఫరా చేసేందుకు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బనశంకరి ఆలయంలో రాహుకాల పూజలు




నగరంలోని బనశంకరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వివిధ వర్ణాల పూలతో అమ్మవారిని, పర్వత మల్లికార్జున స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ నిర్వాహకులు మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. కులాకార సేవలో కొందరు భక్తులు బియ్యం, పప్పు ధాన్యాలు, నెయ్యి తదితరాలు సమర్పించారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (మల్లేశ్వరం)

హోసూరు

నిరుద్యోగుల స్వయం ఉపాధికి రుణం

హోసూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగులు స్వయంఉపాధి పొందడానికి పీఎం ఉపాధి హామీ పథకం కింద రుణ సాయం అందజేస్తున్నట్లు కలెక్టర్ సరయు తెలిపారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయ సభాంగణంలో ఆమె అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిక్ (జిల్లా పరిశ్రమల కేంద్రం) అధికారి ప్రసన్న, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 19 మంది నిరుద్యోగులకు రూ.12.03 కోట్లు, 20 మంది విద్యార్థుల ప్రైవేటువులకు రూ.1.20 కోట్ల విలువైన చెక్కులను కలెక్టర్ అందజేసి మాట్లాడారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు జిల్లాలో నిర్వహిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి రూ.3,508.87 కోట్ల రుణం వితరణ చేసినట్లు వెల్లడించారు. అక్టోబరు నెలలో 135 మందికి రూ.73.68 కోట్ల రుణ సాయం చేసినట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల అభివృద్ధి ప్రసన్న రుణం వితరణలో లభిస్తున్న రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు అధికారి శరవణన్, తమిళనాడు పెట్టుబడుల సంస్థ అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత సీతారాం మృతి


కరుపల్లి సీతారాం

హోసూరు, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత, తెలుగు భాషాభిమాని డాక్టర్ కరుపల్లి సీతారాం శుక్రవారం వేకువ జామున అనారోగ్యంతో బెంగళూరు 'హెచ్ఏఎల్' లేఅవుట్‌లో మృతి చెందారు. హోసూరు సమీపంలోని జాగీరు కరుపల్లి గ్రామంలో జన్మించిన సీతారాం వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయన తెలుగు భాషాభిమాని. కోలారు జిల్లా జానపద కళలపై పరిశోధన జరిపి పీహెచ్‌డీ పట్టా పొందారు. వివిధ పౌరాణిక నాటకాల్లో వేషాలు ధరించి మంచి కళాకారుడిగా ప్రసిద్ధి పొందారు. పలు రచనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే దివంగత కె.ఎస్.కోదండరామయ్యకు సమీప బంధువు. బెంగళూరులోని మేలుకలయికలో సభ్యుడిగా ఉన్నారు. అంత్యక్రియలు 26న జరుగుతాయని బంధువులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలు తెలుగు సంస్థలు సంతాపం తెలిపాయి.


తుమకూరు: దిబ్బూరులో నిలిచిన వాన నీటిలో కష్టంగా వస్తున్న విద్యార్థులు


తుమకూరు: పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జిల్లాధికారి, ఎస్పీ, పాలికె కమిషనర్ తదితరులు


జాలహళ్లి: బ్యాట్రాణపురలో ఓ వీధిని పరిశీలిస్తున్న పోలీసులు

వెంటాడుతున్న వర్షాలు

● జనజీవనం అస్తవ్యస్తం

చిక్కబళ్లాపుర, తుమకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. చిక్కబళ్లాపుర జిల్లా కేంద్రంతో పాటు గౌరీబిదనూరు, బాగేపల్లి, చింతామణి, శిడ్లఘట్ట తాలూకాల్లో పంటలు, తోటలకు భారీ నష్టం వాటిల్లింది. చెరువులు, వాగులకు సమీపంలో ఉంటున్న ఆవాసాల్లోకి నీరు చొరబడింది. పలు గ్రామాల్లో నాలుగు రోజులుగా విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ చేయలేదు. నంది గ్రామంలోని దుకాణాలు, నివాసాల్లోకి నీరు చేరుకుంది. దేవనహళ్లిలోని కింద వంతెన సమీపంలోని తుప్పల్లోకి వరద నీటితో కారు కొట్టుకొచ్చింది. స్థానికులు, అగ్నిమాపకదళ సిబ్బంది స్పందించి కారులో ఉన్న వ్యక్తిని రక్షించారు.

జలదిగ్బంధంలో దిబ్బూరు: తుమకూరు నగరంలోని అమాని చెరువు మరువ పారడంతో వరద ప్రవాహం దిగువ ప్రాంతంలోని దిబ్బూరు గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. పలు ఇళ్లు, దుకాణాలు, పంటపొలాలు నీట మునిగాయి. గ్రామంలో జిల్లాధికారి శుభా కల్యాణ్, ఎమ్మెల్యే జ్యోతిగణేష్, మహానగర పాలికె కమీషనర్ అశ్విజ, ఎస్పీ అశోక్ తదితరులు పర్యటించారు.


చిక్కబళ్లాపుర: తుప్పల్లో చిక్కుకుపోయిన కారు, వంతెన కింద వరద ప్రవాహం

నష్టపోయిన కుటుంబాల వివరాలు తెలుసుకున్నారు. పలువురు గ్రామస్థులను సముదాయ భవనంలోకి తరలించాలని, తాత్కాలిక బసకు వసతి కల్పించాలని పాలికె కమీషనర్ బి.వి.అశ్విజకు సూచించారు. ఎమ్మెల్యే జ్యోతి గణేష్ మాట్లాడుతూ 2019, 2022 లోనూ అమాని చెరువు మరువ పారడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. 207, 208 సర్వే నంబర్లలోని రాజకాలువలో వర్ష నీటి ప్రవాహం సక్రమంగా సాగడం లేదని, అందువల్లే గ్రామం జలావృతమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

వాన నీటిలోనే రాజధాని

బెంగళూరు (జాలహళ్లి): రాజధాని బెంగళూరులో భారీ వర్షాలకు శివారు ప్రాంతాలు, మురుగువాడల్లోని ఇళ్లలోకి వచ్చిన నీరు ఇంకా అలాగే ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని జీవిస్తున్నారు. పలు రహదారులు గుంతలమయం కావడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు వర్షపు నీటిలో కొట్టుకొచ్చిన చెత్తాచెదారం, వ్యర్థాలతో భరించలేని దుర్వాసన వస్తుండటంతో రోగాలు వస్తాయని భయపడుతున్నారు. మహానగర పాలికె పారిశుద్ధ్య కార్మికులు వాటిని తొలగించే పనుల్లో ఉన్నారు. జాలహళ్లి, బ్యాట్రాయణపుర, తిండ్లు, శారాదాంబనగర్, ఆర్‌సీపుర, ఖాతనగర్, సిద్ధార్థనగర, కేజీహళ్లి, మత్తికెరె గుడెసలు, లోతట్టు కాలనీలు, సోమదేవనహళ్లి తదితర ప్రాంతాల్లోని రహదారులు వాగులను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు నీట మునిగాయి. మురుగువాడ ప్రజలు పలు పాఠశాలల్లో ఆశ్రయం పొందారు. ప్రభుత్వం త్వరితగతిన తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ప్రజలకు హెచ్చరిక: తుమకూరు నగరంలోని ఆర్‌టీ నగర్, హోరీముద్దప్ప బడావణెలో కుండపోతతో ఇళ్లలోకి మురుగునీరు ప్రవేశించింది. పాలికె అధికారుల దృష్టికి తెచ్చినా పటించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. నగర ఎమ్మెల్యే, పాలికె అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కొరటగెరె తాలూకా గొరవనహళ్లి పుణ్యక్షేత్రం సమీప తీతా డ్యాం నుంచి ప్రవాహం ఉద్ధృతంగా ప్రవహించడంతో దిగువ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వలయ మార్గంపై అన్నదాతల ఆవేదన


నీట మునిగిన పంటపొలాలు

అచ్చంద్రం (బేలికె), న్యూస్‌టుడే: వలయ మార్గం నిర్మాణంతో రూ.3 కోట్లు నష్టం కలిగిందని తుమ్మనపల్లి బాధిత రైతులు పిల్లారెడ్డి, రామిరెడ్డి వాపోయారు. వారు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అచ్చంద్రం మీదుగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పెద్ద ఎత్తున రింగ్ రోడ్డు పనులు చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలోని పంట పొలాలకు రాకపోకలకు వీల్లేకుండా అడ్డంగా గోడ, అచ్చంద్రం దగ్గర కిలో మీటరు దూరంలో మినీ వంతెన నిర్మించడంతో రాజ కాలువకు వెళ్లాల్సిన వర్షపు నీరు దారిమళ్లి పంటపొలాలను ముంచెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, జాతీయ రోడ్డు ప్రాధికార సంస్థ తగు చర్యలు తీసుకోవాలన్నారు. అట్టూరు, తుమ్మనపల్లి, బడిదేపల్లి, నందిమంగలం, ఆలూరు తదితర గ్రామాల రైతులను ఆదుకునేలా ఇరువైపులా సర్వీస్ రోడ్డు, కింది వంతెనలు నిర్మించాలన్నారు. అడ్డంగా వేసిన గోడలను తొలగించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని విన్నవించారు. సమావేశంలో అన్నదాతలు గోపాలరెడ్డి, రామమూర్తి, రాజగోపాల రెడ్డి, వెంకటేశ రెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మారప్ప తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ క్యాన్సర్‌పై అవగాహన అవసరం


వ్యాధుల గురించి వివరిస్తున్న వైద్యురాలు హనాశెట్టి

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: నగరంలోని మూడబిదిరే రోటరీ క్లబ్ సహకారంతో ఆళ్వాస్ శిక్షణా ప్రతిష్ఠాన ఆధ్వర్యంలో వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినులకు గర్భకోశ క్యాన్సర్, హెచ్‌పీవీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐదువేలకుపైగా విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు హనాశెట్టి, రమ్య సుప్రజాశెట్టి, సౌధ, అతిథి శెట్టి, సహన, మానస క్యాన్సర్‌కు కారణాలు తెలిపారు. తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై వివరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ హరీష్‌నాయక మాట్లాడుతూ ఈ ఏడాది చివరిలో వందకుపైగా క్యాన్సర్ జాగృతి శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో కేరళ వాసి విషాదాంతం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : పాత విమానాశ్రయం రోడ్డులో శుక్రవారం వేకువ జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో కేరళకు చెందిన టెకీ రోహన్ (21) మరణించాడు. మారతహళ్లిలోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఆయన ఉద్యోగి. విధులను ముగించుకుని బైకుపై ఇంటికి వెళుతున్న సమయంలో నియంత్రణ తప్పి రహదారి విభాజకాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. తలకు తీవ్ర గాయాలైన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు. హెచ్ఏఎల్ ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్యానికి పెద్దపీట వేయండి


జ్యోతి వెలిగిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించే పథకాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో విధానసౌధ బాంకెట్ హాల్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సిద్ధరామయ్య మాట్లాడుతూ తనకు మూడు దశాబ్దాలుగా మధుమేహం ఉన్నా క్రమశిక్షణతో కూడిన జీవనశైలితో వ్యాధిని అదుపులో ఉంచుకున్నట్లు చెప్పారు. గుండెకు స్టెంట్ వేయించుకుని 24 ఏళ్లయినా ఇప్పటివరకు అన్ని పనులను స్వయంగా చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటే అన్నింటినీ కాపాడుకున్నట్లేనన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఒత్తిడితో కూడిన జీవనశైలి, సకాలంలో తిండి, నిద్ర లేకపోవడం, చెడు అలవాట్లతో రకరకాల వ్యాధులకు గురవుతారన్నారు. గుడ్లు, చేపలు, మాంసం తింటే మధుమేహం వస్తుందని కొందరిలో అపోహ ఉందన్నారు. శారీరక శ్రమ, వ్యాయామం, ధ్యానంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. రవాణా మంత్రి రామలింగారెడ్డి, చట్టసభ ప్రతినిధులు అశోక్ పట్టణ్, నసీర్ అహ్మద్, సుధామదాస్, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి హర్ష గుప్త తదితరులు పాల్గొన్నారు.

కూర్మాసనంలో మేఘన రికార్డు


క్రీడాకారిణి మేఘన


కూర్మాసనం

బెంగళూరు (క్రీడలు) : అనుకున్నది సాధించాలనే తపన ఉంటే కచ్చితంగా విజయం సిద్ధిస్తుందనడానికి 13 ఏళ్ల విద్యార్థిని మేఘనా శెట్టిగార్ నిలిచారు. కూర్మాసనంలో ఈ విద్యార్థిని గంట 17 సెకెన్ల పాటు స్థిరంగా ఉండి 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్'లో తన పేరు పదిలం చేసుకుంది. గతంలో ఈ రికార్డు మధ్యప్రదేశ్‌లోని స్నేహ అనే అమ్మాయి పేరిట ఉండేది. ఆమె 45 నిమిషాల పాటు కూర్మాసనంలో ఉండగా, దాన్ని మేఘన అధిగమించింది. మంగళూరు దేరేబైల్ నెక్కిలగుడ్డలో నివసిస్తున్న హరీష్ శెట్టిగార్, కవితాశెట్టి కుమార్తె మేఘన లేడీహిల్ విక్టోరియా పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు పాఠశాలలో యోగా శిక్షకురాలు కవితా అశోక్ మార్గదర్శకంలో చిరు ప్రాయంలోనే యోగా సాధన చేపట్టింది. కవితా అశోక్ మాట్లాడుతూ ఒకేసారి ఇంతసేపు కూర్మాసనంలో ఉండటం చాలా కష్టమని, తన శిష్యురాలు మేఘన కొన్నేళ్లుగా దీనిపై సాధన చేసి రికార్డు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ కుమార్తె ఘనతపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. శిక్షకురాలు కవితా అశోక్ ప్రోత్సాహంతో తమ బిడ్డ ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో ఎక్కడం, సాధనకు మద్దతు ఇచ్చిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. తనకు అండగా నిలిచిన ఉపాధ్యాయులు ఉజ్వల, పుష్పాలకు మేఘన కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతోనే పిల్లలకు ఉజ్వల భవిత


డప్పు వాయించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి నూరున్నీసా తదితరులు

తుమకూరు న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు కాకుండా పాఠశాలలకు పంపించి బాగా చదివించాలని జిల్లా సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి నూరున్నీసా విజ్ఞప్తి చేశారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని కురిపాళ్యలోని ఎస్సీ కాలనీలో ఆమె బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై చేపట్టిన అవగాహన సదస్సును డప్పు వాయించి ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లలోపు పిల్లలను డబ్బు సంపాదన కోసం పనులకు పంపించడం నేరమన్నారు. చదివించకపోతే వారి భవిష్యత్తు తీవ్రంగా దెబ్బ తింటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉజ్వల భవిష్యత్తు కోసం చదివించాలని కోరారు. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై రూపొందించిన వీధి నాటకాలను కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి తేజావతి, ఇన్‌స్పెక్టర్ నాగభూషణ్, చంద్రు, స్థానికులు పాల్గొన్నారు.

రాయితీ ధరల్లో పర్యాటక ప్యాకేజీలు


సంస్థ యాజమాన్య ప్రతినిధులు, సిబ్బందితో నటి ప్రణీత సుభాష్

బెంగళూరు (మల్లేశ్వరం) : దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు రాయితీ ధరలో ప్యాకేజీలను అందిస్తున్నామని ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత రావ్ రమణ తెలిపారు. 24 ఏళ్లుగా సేవలు అందిస్తున్న సంస్థ తన నూతన కార్యాలయాన్ని గంగానగరలో శుక్రవారం ప్రారంభించింది. నటి ప్రణీత సుభాష్, హెచ్‌ఆర్ సురేఖతో కలిసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు పర్యాటకులను తీసుకెళ్లడంతో పాటు విదేశీ ప్యాకేజీలను అందిస్తున్నామని తెలిపారు. నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన నేపథ్యంలో ఈ నెల 31లోగా బుకింగ్ చేసుకునే వారికి బ్యాంకాక్ రూ.32,999, కాశీ-అయోధ్య రూ.19,999, సింగపూర్-మలేషియా రూ.1.06,000, దుబాయ్ రూ.97,500ల ప్యాకేజీలను అందిస్తున్నామని చెప్పారు. ఐరోపా, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ, శ్రీలంక తదితర ప్రాంతాల పర్యటనలో భారతీయ శైలి ఆహారాన్ని అందించేలా ప్యాకేజీలను రూపొందించామని ఆయన వివరించారు.

మహిళలు స్వయంగా ఎదగాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్ తదితరులు

పావగడ: తమ కుటుంబాల అభివృద్ధి కోసం వనితలు పురుషులపై ఆధార పడకుండా స్వయంగా ఉపాధితో ఎదగాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అన్నారు. ఆయన స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో శుక్రవారం శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామాభివృద్ధి పథకం, బీసీ ట్రస్ట్‌లు ఏర్పాటు చేసిన వరమహాలక్ష్మి పూజ, ధార్మిక సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధర్మస్థళ వారు తాలూకాలోని దాదాపు 38,000 మంది మహిళలతో 3,800 స్వయం సహాయక సంఘాలు రూపొందించి రుణాలు అందజేశారన్నారు. దీనివల్ల ఆ మహిళలు తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తూ పిల్లల విద్యాభ్యాసానికి తోడ్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు పీహెచ్ రాజేష్, ఉపాధ్యక్షురాలు గీత, సభ్యులు సుదేశ్‌కుమార్, రవి, ధర్మస్థల ట్రస్ట్ యోజనాధికారి హెచ్.మహేశ్, ఎస్సెన్ గురునాథ్, రైతు సంఘం నాయకుడు నరసింహారెడ్డి, జనజాగృతి వేదిక జిల్లా సభ్యుడు రాజగోపాల పాల్గొన్నారు.

ఖోఖోలో చిత్రకూట విద్యార్థుల సత్తా

బెంగళూరు (క్రీడలు) : హరియాణాలో జరిగిన సీబీఎస్ఈ పాఠశాలల ఖోఖో పోటీల్లో నగరానికి చెందిన చిత్రకూట పాఠశాల బాలురు, బాలికల విభాగాల్లో ఛాంపియన్‌గా నిలిచింది. గౌతమ్‌గౌడ, ఎం.ఎస్.సుశ్రుత నాయకత్వంలో ఈ విజయాన్ని సాధించారు. బాలుర జట్టులో అరుష్‌గుణకీమఠ, అభ్యుదయ గిరీష్, ఆదిత్య రవిశంకర, అంకుష్, జయంత్‌రామ్, చిరాగ్, ధ్వనీన్, ధీరజ్‌ప్రకాష్ తదితరులు, బాలికల జట్టులో కె.దిశా, ధన్యతా, సుకృతి, ఉన్నతి, ప్రగతి తదితరులు ఉన్నారు. ఛాంపియన్ జట్టు సభ్యులను పాఠశాల కార్యదర్శి చైతన్య, ప్రిన్సిపల్ జోయిషచటర్జీ అభినందించారు.

స్పెల్‌బీ పోటీల్లో ఏడుగురికి ర్యాంకులు


సృష్టి


శయనా దాస్


రితిక శశికాంత్


సంజయ్ రాజేంద్రన్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఆంగ్ల భాషా నైపుణ్యం మెరుగుకు పదిహేను ఏళ్లుగా నిర్వహిస్తున్న స్పెల్‌బీ పోటీల్లో బెంగళూరుకు చెందిన ఏడుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ ఏడాది పోటీల్లో పదివేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వైదేహి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన శయనా దాస్ గ్రేడ్-2, దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి సంజయ్ రాజేంద్రన్ గ్రేడ్-3లో మొదటి ర్యాంకులు సాధించారు. మారతహళ్లి న్యూ హారిజాన్ గురుకుల పాఠశాల విద్యార్థిని సృష్టి ప్రజ్ఞా గ్రేడ్-2లో ద్వితీయ, రితికా శశికాంత్‌గావడే, ఎన్ఎస్ అనుషా, వీక్షా కరియప్ప, సమర్థ్ కిశోర్ ఆచార్యలు ర్యాంకులు దక్కించుకున్నారని స్పెల్ బీ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ప్రకటించారు.

56,993 హెక్టార్లలో పంటల నష్టం


బెళగట్టలో నష్టపోయిన ఉల్లిని పరిశీలిస్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇప్పటివరకు అతివృష్టితో 56,993 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా అని రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ అన్నారు. ఆయన శుక్రవారం చిత్రదుర్గం తాలూకాలో పర్యటించి నష్టపోయిన పంటపొలాలను సందర్శించారు. బెళగట్ట గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టితో రైతులకు జరిగిన పంటల నష్టానికి కేంద్రం చెల్లించే పరిహారం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి కేంద్ర మంత్రులు, ఎంపీలు నష్ట పరిహారం పెంచాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. చిత్రదుర్గం, దావణగెరె, విజయనగర, తుమకూరు తదితర జిల్లాల్లో భారీగా పంటల నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం వివిధ జిల్లాలకు రూ.666 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. చిత్రదుర్గం జిల్లా పాలనాధికారి వద్ద రూ.15.50 కోట్లు నిధులు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.100 కోట్ల నష్ట పరిహారాన్ని చెల్లించామన్నారు. ప్రకృతి విపత్తులతో 115 మంది చనిపోయారని, ఆయా బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించామన్నారు. ఆయన వెంట జిల్లా పాలనాధికారి వెంకటేశ్, అదనపు కలెక్టర్ కుమారస్వామి, సహాయక కమిషనర్ కార్తీక్, తహసీల్దారు నాగవేణి, ఉద్యానవన పంటల శాఖ డీడీ శరణప్ప తదితరులున్నారు.

నీట మునిగి విద్యార్థి మృతి


గాలిస్తున్న అగ్నిమాపకదళ సిబ్బంది (అంతరచిత్రంలో) వెంకటాచలపతి

చిక్కబళ్లాపుర: చిక్కబళ్లాపుర జిల్లా గుడిబండె పట్టణం సంత వీధిలోని నేల బావిలో ఈతకు దిగిన వెంకటాచలపతి (18) అనే విద్యార్థి మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గౌరీబిదనూరు తాలూకా భక్తరహళ్లికి చెందిన విద్యార్థి గుడిబండె ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చదువుతున్నాడు. మృతదేహాన్ని అగ్నిమాపకదళ సిబ్బంది శుక్రవారం ఉదయం నేల బావి నుంచి వెలికి తీశారు. గుడిబండె ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేలం పారదర్శకంగా ఉండాలి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మద్యం దుకాణాల వేలం ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా చూడాలని రాష్ట్ర మద్యం వ్యాపారుల సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. తమకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను పరిష్కరించాలని కోరుతూ స్వాతంత్ర్య ఉద్యానంలో శుక్రవారం ధర్నాకు దిగారు. అన్ని జిల్లాలు, తాలూకాల నుంచి వచ్చిన మద్యం వ్యాపారులు ఆందోళనలో పాల్గొన్నారు. గోవా, కేరళ నుంచి మద్యం ఇక్కడికి రాకుండా చెక్‌పోస్టుల వద్ద ఎక్సైజ్ శాఖ సోదాలను ముమ్మరం చేయాలని విన్నవించారు. బెంగళూరు తరహాలో ఇతర నగరాలు, పెద్ద పట్టణాల్లో రాత్రి ఒంటి గంట వరకు వ్యాపారం నిర్వహించుకునేందుకు అవకాశం ఇవ్వాలని వ్యాపారులు డిమాండు చేశారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

'మైసూరు' టికెట్ల ధర పెంపు

మైసూరు, న్యూస్‌టుడే : విశ్వవిఖ్యాత మైసూరు ప్యాలెస్ ప్రవేశ ధరలను పెంచుతూ ప్యాలెస్ పాలక మండలి ఆదేశాలు జారీ చేసింది. పెద్దలకు రూ.100, బాలలకు రూ.70, విదేశీ పర్యాటకులకు రూ.1000 టికెట్ ధరగా నిర్ణయించింది. పదేళ్లలోపు చిన్నారులకు ప్రవేశాన్ని ఉచితం చేసింది. ఎడ్యుకేషనల్ టూర్‌కు వచ్చే విద్యార్థులకు రూ.50 టికెట్ ధర ప్రకటించారు. ఈ ధరల పెంపు శుక్రవారం నుంచే అమల్లోకి రాగా.. వీటి లోనే జీఎస్టీ కలిసి ఉంటుంది. పాదరక్షల స్టాండ్, లగేజ్ గది, మరుగుదొడ్డి వినియోగానికి ఇప్పటి వరకు నగదు వసూలు చేస్తుండగా.. ఇకపై ఈ సేవలను ఉచితంగా వినియోగించుకోవచ్చని ప్యాలెస్ పాలక మండలి సూచించింది.

పద్మవ్యూహం ఛేదిస్తా : దళపతి నిఖిల్ ప్రతిన

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం పద్మవ్యూహాన్ని, చక్రవ్యూహాలను ఛేదిస్తానని జనతాదళ్, భాజపా ఉమ్మడి అభ్యర్థి నిఖిల్ కుమారస్వామి ప్రతినబూనారు. తాత- మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవేగౌడ, తండ్రి- కేంద్ర మంత్రి కుమారస్వామి, భార్య రేవతితో కలిసి జేపీనగరలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పూజలు చేసుకున్నారు. చెన్నపట్టణ మొదటి నుంచి దళ్‌కు పట్టున్న నియోజకవర్గమని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో గెలుపు సాధించడమే లక్ష్యంగా ప్రచారాన్ని చేస్తానని తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు తాను చెన్నపట్టణలోనే ఉంటానని మాజీ ప్రధాని దేవేగౌడ ప్రకటించారు. ప్రచారానికి వెళ్లకుండా వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలతో వరుస సమావేశాలను నిర్వహిస్తానని ఆయన చెప్పారు.

విద్యతోనే అసమానతలు అంతం



రాజ్యాంగ నిబంధనలను పాటిస్తామంటూ ప్రమాణం చేస్తున్న మంత్రి, ముఖ్యమంత్రి, ఇతర ప్రతినిధులు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : విద్యతోనే అసమానతలు తొలగిపోతాయని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. అన్ని కులాలు, మతాలకు చెందిన వారు తమ బిడ్డలను విద్యావంతులను చేసేందుకు కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ అంబేడ్కర్ సాంకేతిక విశ్వవిద్యాలయంలో కొత్తగా నిర్మించిన ఇండోర్ క్రీడా మైదానాన్ని, మొదటి ఏడాది ఇంజినీరింగ్ తరగతులను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. అవకాశ వంచితులను సమాజంలోని ప్రధాన స్రవంతికి తీసుకువచ్చేందుకు అందరికీ విద్యాబుద్ధులు చెప్పించేందుకు హాస్టళ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలను తమ ప్రభుత్వం కల్పిస్తూ వస్తోందని గుర్తు చేశారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు అంబేడ్కర్ పడిన శ్రమను విద్యార్థులను తెలియజేశారు. రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి అసమానతలు క్రమేణా తగ్గుముఖం పడుతూ వచ్చాయని తెలిపారు. సమాజంలో కుల వ్యవస్థ బలంగా వేళ్లూనుకోవడంతోనే వైరుధ్యత, అసమానతలు ఎక్కువ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు, దళితులు, వెనుకబడిన వారు, అల్పసంఖ్యాకులకు ఆర్థిక, సామాజిక న్యాయం దక్కినప్పుడే నవ సమాజ స్థాపన సాధ్యమవుతుందని వివరించారు. మనిషి మరో మనిషిని ద్వేషించకూడదని, ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కొందరు రాజ్యాంగాన్ని మార్చేందుకు విఫల యత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పారిశ్రామికాభివృద్ధికి అనుగుణంగా విద్యార్థులు కౌశల్యాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆశయాలను దృష్టిలో ఉంచుకుని 1980లో ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేడ్కర్ సాంకేతిక విశ్వవిద్యాలయంలో నాణ్యతతో కూడిన బోధన ఉందన్నారు. ఇంజినీర్లుగా పట్టభద్రులు అవుతున్న వారిలో తక్షణమే 15 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్నాయని చెప్పారు. కౌశల్య అభివృద్ధితోనే 60 శాతం వరకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, వర్సిటీ ఆచార్యులు, ఉపకులపతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ, తదితరులు

'ఎడదూరె నాడిన' సాంస్కృతిక ఉత్సవాలు

రాయచూరు, న్యూస్‌టుడే : ఎడదూరె నాడిన సాంస్కృతిక ఉత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26, 27వ తేదీల్లో స్థానిక రంగ మందిరంలో నాటకాల ప్రదర్శన, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాదేవి కళాబృందం హవ్యాసి నాట్య సంఘం (చిక్కసూగూరు) అధ్యక్షుడు నరసింహ వెల్లడించారు. ఆయన శుక్రవారం ఇక్కడ పాత్రికేయుల సమావేశంలో వివరించారు. 26న సాయంత్రం రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ప్రారంభిస్తారని, కన్నడ, సాంస్కృతిక శాఖ అధికారి దత్తప్ప నాగనూరు, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జున, మాజీ అధ్యక్షుడు నరసనగౌడ తదితరులను ఆహ్వానించినట్లు వివరించారు. తొలి రోజు కవి మహదేవ హళ్లి రచించిన ధర్మద తవరు నాటకం, రెండో రోజు కవి ఎ.టి.పాటిల్ రాసిన వీరోచిత ధర్మద దొరె నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. నాటకం తర్వాత ఇతర కార్యక్రమాలు ఉంటాయని విపులీకరించారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు రాజగోపాల్, శాలం, మోహన్, దూళయ్య పాల్గొన్నారు.

గజల్ కృతి రేపు విడుదల

రాయచూరు, న్యూస్‌టుడే : యువ సాహితీవేత్త వేణు జాలిబెంచి రచించిన 'మాతిగ సిగదు నవిలు' (మాటకు దొరకని నెమలి) గజల్ కృతిని ఈ నెల 27న ఇక్కడి కన్నడభవన్‌లో ఆవిష్కరిస్తారు. రాయచూరు తాలూకా కన్నడ సాహిత్య పరిషత్, బిందు ప్రకాశన (గబ్బూరు) సహకారంతో విడుదల చేస్తారు. సీనియర్ సాహితీవేత్త మహంతేశ్ మస్కి చేతుల మీదుగా జాతికి అంకితం అవుతుందని కసాప గౌరవ కార్యదర్శి రావుతరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. తాలూకా కసాప అధ్యక్షుడు వెంకటేష్, కన్నడ అధ్యాపకుడు ఖాదర్ భాషా, సాహితీవేత్తలు వీర హనుమాన్, ఆంజనేయ, వీరశైవ లింగాయత్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పాటిల్ తదితరులు హాజరవుతారని వివరించారు. సాహితీ అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరుతున్నారు.



వంతెన రహదారి మురుగుమయం

రాయచూరు, న్యూస్‌టుడే : స్టేషన్ రహదారిలోని బాలికల పీయూసీ ప్రభుత్వ కళాశాల క్రాస్ నుంచి విద్యాభారతి స్కూల్, పలు కాలనీలకు వెళ్లే రైల్వే వంతెన ఒక వైపు రహదారి మురుగునీటితో నిండిపోతోంది. గత కొన్ని నెలలుగా ఇదే దుస్థితి నెలకొంది. నగరసభ వాహనం ట్యాంకర్లలోకి నీటిని ఎత్తిపోసుకోవడం సర్వ సాధారణంగా మారింది. విద్యాభారతి స్కూల్,చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరు ముందుకు వెళ్లే మార్గం మూసుకుపోయినందునే రహదారి మీద నిలబడుతోంది. మార్గాన్ని తెరిస్తే సాఫీగా ప్రవహిస్తుంది. ఆ దిశగా అధికారులు ఎందుకు ప్రయత్నించడం లేదో అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ట్యాంకర్ నిలబడిన సమయంలో ఒక వైపు రాకపోకలతో సంచారం స్తంభిస్తోంది. వానాకాలంలో వర్షపు నీరు మురుగు నీటతో చేరి ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. విద్యా సంస్థలు, శ్రీరామనగర్, నిజలింగప్ప కాలనీ, రైల్వే క్వార్టర్స్, రాంపూర్, కొన్ని గ్రామాలకు ప్రధాన మార్గం కావడంతో నిత్యం రద్దీగానే ఉంటుంది. మురుగు వాసన భరించలేక చోదకులు ఒకే మార్గంలో తిరుగుతున్నందున సంచారానికి అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా నగరసభ అధికారులు స్పందించి మురుగునీరు సాఫీగా ముందుకు సాగేలా పనులు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


ట్యాంకర్‌లోకి నీటిని ఎక్కిస్తున్న కార్మికులు


ఆగిపోయిన వాహన సంచారం

జలజీవన్ మిషన్ పనుల్లో వేగం పెంచాలి

రాయచూరు, న్యూస్‌టుడే : జలజీవన్ మిషన్ పథకం పనులను వేగంగా పూర్తి చేయాలని రాయచూరు ఎంపీ కుమారనాయక్ అధికారులకు సూచించారు. జిల్లా పంచాయతీ సభాప్రాంగణంలో శుక్రవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, బాధ్య సమితి సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన కుమార మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీరు సరఫరా చేయాలనే ఉద్దేశంతోనే పథకం ప్రవేశపెట్టారని వివరించారు. శాస్త్రీయ పద్ధతుల్లో పైపులను వేయించాలని కోరారు. ప్రధాన మంత్రి వ్యవసాయ సించాయి పథకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. భూసారం పరీక్షలపై ప్రచారం చేయాలని, దీనికి సంబంధించి అన్నదాతలకు కార్డులను త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. ఉద్యానవనాల పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని ఉద్యానవనాల శాఖ అధికారికి నిర్దేశించారు. రహదారుల పనులు నాణ్యతగా ఉండాలని, నిర్ణీత వ్యవధిలో ముగించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చోట వేగ నిరోధకాలు నిర్మించాలని ప్రజాపనుల శాఖకు సూచించారు. జిల్లా పరిధిలో జాతీయ రహదారుల పనులు, భూస్వాధీన ప్రక్రియలో వేగం మందగించిదని కుమారనాయక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫసల్ బీమా పథకంలో బకాయి పరిహారాన్ని విడుదల చేయాలని బీమా కంపెనీలను కోరారు. రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ మాట్లాడుతూ జాతీయ రహదారుల పనులు నత్తనడకన జరుగుతున్నందున ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూస్వాధీనాన్ని చేసుకోవడంలో సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా పాలనాధికారి నితీశ్, జడ్పీ సీఈవో రాహుల్, ఎస్పీ పుట్టమాదయ్య, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కుమారనాయక్, ఎమ్మెల్యే


హాజరైన అధికారులు

బెంగళూరులో సాఫ్ట్‌బాల్ పోటీలు

రాయచూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు ఒకటి నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు బెంగళూరులోని ఆచార్య కళాశాల మైదానంలో సాఫ్ట్‌బాల్ ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహిస్తామని కర్ణాటక సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతినిధి అర్పిత్ వెల్లడించారు. ఆయన శుక్రవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని 32 జిల్లాల ఆటగాళ్లు పాల్గొనేందుకు ఉత్సాహం చూపిస్తున్నారని చెప్పారు. చందన టీవీలో ప్రసారం చేసే వ్యవస్థ కల్పించినట్లు వివరించారు. 700 మంది ఆటగాళ్లు హాజరవుతాయని అంచనా వేశామన్నారు. రాయచూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మల్లణ్ణ మాట్లాడుతూ జిల్లా నుంచి పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశామని, వారికి అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తామని వెల్లడించారు. శిక్షకుడు విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఆడేందుకు ముందుకు రావాలని క్రీడాకారులను కోరారు. సమావేశంలో ప్రతినిధులు వాణిశ్రీ, సంతోష్, రక్షితా పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న అర్పిత్ తదితరులు

బౌద్ధిక జ్ఞానబోధన తప్పనిసరి


రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో బౌద్ధిక జ్ఞానాన్ని పెంపొందించేలా విద్యాశాఖకు సూచించాలని 'దళిత సంఘర్షణ సమితి' జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేసింది. జిల్లా అధ్యక్షుడు ఎన్.ఆర్.రమేష్ నేతృత్వంలో శుక్రవారం జిల్లా అదనపు పాలనాధికారి శివానందను కలసి వినతి పత్రం అందజేశారు. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్యార్థుల బౌద్ధిక సామర్థ్యాన్ని కనీసం పరిశీలించడం లేదని వాపోయారు. నేర్చుకోవాలన్న ఆసక్తి బాలల్లో ఉన్నా పట్టించుకునే వారు కరవయ్యారని బాధ పడ్డారు. కొందరు ఉపాధ్యాయులు ప్రతి నెలా తమకు వేతనం వస్తుందన్న ధోరణితో ఏమీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భావి పౌరుల భవిష్యత్తు దృష్ట్యా బౌద్ధిక జ్ఞాన బోధన తప్పనిసరి అని ఆదేశించాలని కోరారు.


శివానందకు వినతి పత్రం ఇస్తున్న సమితి సభ్యులు

పేదల అభ్యున్నతే ధర్మస్థల సంస్థ ధ్యేయం


మాట్లాడుతున్న మోహన్‌నాయక్

మాన్వి, న్యూస్‌టుడే : సమాజంలో అణగారిన పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ రాయచూరు జిల్లా డైరెక్టర్ మోహన్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యావాహిని వసతి పాఠశాల ఆవరణంలో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయ సంఘాల ఒక్కూట సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యమన్నారు. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ వివిధ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. క్షేత్ర యోజనాధికారి చంద్రహాస్, పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, అరకేరి బసవలింగప్ప, జ్ఞాన మిత్ర, ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్, యోజనాధికారులు, సంస్థ సభ్యులు, ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



బూడిద రవాణాతో తిప్పలు


అధికారికి వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు, యరమరాస్ థర్మల్ కేంద్రాల నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్ (బూడిద)ను ట్యాంకర్లు, టిప్పర్ల రహదారి రవాణా వ్యవస్థను రద్దు చేసి, రైల్వే గూడ్స్ ద్వారా తరలించేలా కర్ణాటక విద్యుత్తు నిగమకు సూచించాలని 'దళిత సేన' జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడు మారుతి నాయకత్వంలో ప్రతినిధులు మధుకాంత్, భీమేశ్ కుర్డి, బసవరాజ్, కృష్ణ, వెంకటేష్ సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. వాహనాల సామర్థ్యానికి మించి ఫ్లైయాష్‌ను నింపుతున్నందున రహదారులు దెబ్బతిన్నాయని, ప్రజా సంచారానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఫిర్యాదు చేశారు. ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిక్కసూగూరు, హెగ్గసనహళ్లి, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు బూడిద కాలుష్యాన్ని పీల్చి శ్వాస కోశ, హృదయ సంబంధ రోగాల బారిన పడుతున్నారని వివరించారు. గూడ్స్ ద్వారా తరలించే అవకాశమున్నా.. థర్మల్ కేంద్రాల అధికారులు నిర్లక్ష్యంతో రహదారి మార్గానికి అనుమతి ఇచ్చారని ఆరోపించారు. వాహనాల సంచారాన్ని రద్దు చేయకపోతే రాబోవు రోజుల్లో హైదరాబాద్ రహదారిని బంద్ చేస్తామని ప్రతినిధులు హెచ్చరించారు.

కేడీపీ సమితిలో ఇద్దరు తెలుగు యువకులు

సింధనూరు, న్యూస్‌టుడే : సింధనూరు తాలూకా పంచాయతీ (కేడీపీ త్రైమాసిక పరిశీలనా సమితి)కి సింధనూరు తాలూకాలోని ఇద్దరు తెలుగు యువకులు నామినేట్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యోజనా కార్యక్రమ సంయోజన-సాంఖ్యక శాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సమితికి మొత్తం ఆరుగురు నామినేట్ సభ్యులను నియమించింది. ఇందులో భీమరాజ్ క్యాంపు కోయలమూడి నరేంద్ర, రైతునగర్ క్యాంపు వీఎంఆర్.రవీంద్రరెడ్డి ఉన్నారు. మరియప్ప జాలిహాళ, వెంకోబ జిన్నద్ కల్లూరు క్రాస్, హనీఫ్ సాలగుంద, వీణ వీరనగౌడ గోనవార తదితరులు ఇతర సభ్యులుగా ఉన్నారు. నరేంద్ర, రవీంద్రలకు వివిధ తెలుగు క్యాంపుల పెద్దలు అభినందనలు తెలిపారు.

ఇసుక టిప్పర్ బోల్తా

మాన్వి : మాన్వి తాలూకా చికల్‌పర్వి నుంచి బసవనబాగేవాడి వెళుతున్న ఇసుక టిప్పర్ గొల్లదిన్ని గ్రామం మారెమ్మదేవి దిబ్బ వద్ద బోల్తా పడింది. వాహన చోదకుడు మంజునాథ్, క్లీనర్ అర్జున స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని సిరివార ఎస్సై అమరేగౌడ పరిశీలించారు. రోడ్డుకు అడ్డంగా పడిన వాహనాన్ని పక్కకు తీసి వాహన సంచారానికి ఇబ్బంది లేకుండా చేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

25-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.93	1610.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	48,221	84
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	48,314	9,775
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.500	37.785

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

యువత ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి


సదస్సులో పాల్గొన్న యువకులు

మాన్వి, న్యూస్‌టుడే : యువతీ యువకులు ఆత్మ విశ్వాసం, పట్టుదలతో కృషి చేస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారని హానగల్ లయోలా వికాస్ కేంద్రం నిర్వాహకులు ఫాదర్ జెరాల్డ్ పేర్కొన్నారు. స్థానిక లయోలా కళాశాలలో 'నవసమాజం కోసం యువతీ యువకులు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్య జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సంస్థ చేయూత ఇస్తుందన్నారు. వారికి ఆసక్తి ఉన్న రంగంలో తర్ఫీదునిచ్చి, జీవితంలో స్థిరపడే విధంగా కృషి చేస్తుందన్నారు. వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించటం, వృత్తి మార్గదర్శనం చేయటం తదితర అంశాలపై తర్ఫీదు ఇస్తున్నట్లు వివరించారు. సదస్సులో 40 మంది యువకులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా పండగ ఆచరిద్దాం

రాయచూరు, న్యూస్‌టుడే : నగర పౌరులు దీపావళి పండగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని రాయచూరు నగరసభ కమిషనర్ గురుసిద్ధయ్య హీరేమఠ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రసాయనిక మిశ్రాలతో తయారైన బాణసంచా కాల్చడం వల్ల వాయుకాలుష్యం అధికమై.. మనుషులు, మూగ జీవాల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందనే విషయాన్ని గమనించాలని కోరారు. పరిసరాలకు హాని కల్గించని టపాకులను పేల్చాలన్నారు. పర్యావరణానికి నష్టం కల్గించకుండా పర్వదినాన్ని జరుపుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించినట్లు స్పష్టం చేశారు.

